



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 11 | సంచిక : 360 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | గురువారం 14 ఆగస్టు 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## అభివృద్ధికి మేం వ్యతిరేకం కాదు..

### తెలంగాణ సర్కార్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



- పర్యావరణ పరిరక్షణనూ పరిగణనలోకి తీసుకోవాలె
- మంచి ప్రతిపాదనలతో వస్తే అభినందిస్తం
- కంచ గచ్చిబౌలి భూముల కేసులో సుప్రీంకోర్టు

హైదరాబాద్ పెన్ పవర్:కంచ గచ్చిబౌలి భూముల కేసు విచారణ సందర్భంగా ఆగస్టు 13న సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని తేల్చి చెప్పింది. పర్యావరణ పరిరక్షణకు తెలంగాణ సర్కారు తీసుకుంటున్న చర్యలను స్వాగతిస్తున్నామని తెలిపింది. హైదరాబాద్ శివార్లలోని కంచ గచ్చిబౌలి ప్రాంతంలో తెలంగాణ ప్రభుత్వం 1,000 చెట్లను నరికివేయడంపై సుమోటోగా దాఖలైన కేసును చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్. కే వినోద్ చంద్రన్ తో

వివరాలు 2లో..





- భారీ వర్షానికి జనజీవనం అస్తవ్యస్తం
- మంచిర్యాలలో రికార్డు స్థాయిలో వాన
- హైదరాబాద్లో లోతట్టు ప్రాంతాలు జలమయం
- బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం
- వరంగల్లో కొనసాగుతున్న సహాయ చర్యలు
- నేడు కూడా వాన కంటిన్యూ






# కుండపోత

## 11 జిల్లాలకు రెడ్ అలర్ట్

హైదరాబాద్ పెన్ పవర్:రాష్ట్రంలో కుండపోత వర్షం కురుస్తోంది. హైదరాబాద్ నగరంతో పాటు పలు జిల్లాల్లో వాన దంచి కొడుతోంది. హై దరాబాద్ లోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ. ఐకియా సెంటర్, మాదాపూర్, జీడిమెట్ల, కుత్బుల్లాపూర్, పంజాగుట్ట, కూకట్పల్లి, అమీర్పేట సహ పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. వర్షం కారణంగా రోడ్లపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్ప డింది. మూడు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో పాఠశాలలకు సెలవులు ప్రకటిం చిన విషయం తెలిసిందే. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దాంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజలకు ఇబ్బందులు కలు గకుండా చర్యలు చేపట్టింది. సూర్యాపేట జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిన్న రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు వర్షం దంచి కొట్టింది. అత్యధికంగా నాగారంలో 19 సెం.మీ వర్షపా తం నమోదైంది. జాజిరెడ్డిగూడెం, నూతనక ల్, అడ్డగూడూరు, మోత్కూరులో కూడా భారీ వర్షం కురిసింది. తుంగతుర్తి మండలంలోని సంగెంవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నూతనకల్, జాజిరెడ్డిగూడెం మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. తూర్పుగూడెం లో ఇండ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు. రాత్రంతా జాగారం చేయాల్సి వచ్చింది. జాజి రెడ్డిగూడెం మండలం అర్వపల్లిలోని కేజీబీవీని వరద నీరు చుట్టుముట్టింది. దాంతో అధికారు లు ట్రాక్టరు సాయంతో విద్యార్థినులను సుర క్షిత ప్రాంతానికి తరలించారు. అటు ఖమ్మం జిల్లాలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతా వరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో

వివరాలు 2లో..

### జలపాతాల పరవళ్లు

భారీ వర్షాలకు ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్ నగర్ జిల్లా పరిధిలోని జలపా తాలు పరవళ్లు తొక్కుతున్నాయి. కుంటల, పొచ్చెర, గుండాల, బొగత, గాయత్రి, బొగత, ముత్యాల ధార, సహస్ర కుండ్, మల్లెల తీర్థం జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నాయి. బొగత జలపాతం వద్దకు పర్యాటకులను అనుమతిం చడం లేదు. పర్యాటకుల తాకిడి నేపథ్యంలో పలుచోట్ల పోలీసులు పహారా కాస్తున్నారు.

## ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ

- కాళేశ్వరం ప్రాజెక్టు కింది జలాశయాలను నింపాలని విజ్ఞప్తి
- రైతుల కోసం ఆరో ప్యాకేజీ వద్ద ఉన్న మోటార్లు ఆన్ చేయాలన్న మాజీ మంత్రి
- జలాశయాల్లో నీరు నింపకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఉన్న జలాశయాలను నింపాలని ఆయన

వివరాలు 2లో..

## బెట్టింగ్ యాప్స్ కేసు: మంచు లక్ష్మిని మూడున్నర గంటలు ప్రశ్నించిన ఈడీ

హైదరాబాద్ పెన్ పవర్:బెట్టింగ్ యాప్ ప్రమోషన్స్ కేసులో మంచు లక్ష్మి ఈడీ విచారణ ముగిసింది. దాదాపు మూడున్నర గంటల పాటు మంచు లక్ష్మిని విచారించారు ఈడీ అధికారులు. ఐదేళ్ల బ్యాంక్ స్టేట్ మెంట్స్ ను ఈడీకి అందజేశారు మంచు లక్ష్మీ. ఈ సందర్భంగా విచారణలో మంచు లక్ష్మి స్టేట్ మెంట్ ను రికార్డ్ చేసుకుంది ఈడీ. బుధవారం (ఆగస్టు 13న) విచారణలో భాగంగా మంచు లక్ష్మీ ఈడీ కార్యాలయానికి వచ్చారు. ఈజీగా డబ్బు సంపాదించొచ్చు అంటూ

వివరాలు 2లో..



## ఏపీ ఎన్నికలపై జగన్ వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ

- ఏపీ ఎన్నికలపై రాహుల్ గాంధీ మాట్లాడలేదన్న జగన్
- చంద్రబాబు, రేవంత్ రెడ్డిల కారణంగానే మాట్లాడలేదని విమర్శ
- అలాంటి వ్యాఖ్యలు సరికాదన్న చామల కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్ పెన్ పవర్:ఆంధ్రప్రదేశ్ ఎన్నికలపై రాహుల్ గాంధీ మాట్లాడలేదంటూ ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ చామల కిర ణ్ కుమార్ రెడ్డి స్పందించారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిలపై జగన్ చేసిన వ్యాఖ్యలు సరికాదని అన్నారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి వల్లే రాహుల్ మాట్లాడలేదని ఆరోపించడం సముచితం కాదన్నారు. ఎన్నికల్లో

వివరాలు 2లో..



## సెమీకండక్టర్ ప్రాజెక్టుపై తెలంగాణకు కేంద్రం అన్యాయం చేసింది

- తెలంగాణ ప్రతిపాదనను కేంద్రం పక్కన పెట్టిందన్న శ్రీధర్ బాబు
- ఒక ఎకరా కేటాయించకపోయినా ఏపీకి ప్రాజెక్టుకు కేటాయించారన్న మంత్రి
- కేంద్రం నిర్ణయాలు తెలంగాణకు అవమానకరంగా ఉన్నాయని వ్యాఖ్య



హైదరాబాద్ పెన్ పవర్: సెమీకండక్టర్ ప్రాజెక్టు కేటాయింపు విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పట్ల తీవ్ర వివక్ష ప్రదర్శించిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు తెలంగాణకు అవమానకరంగా ఉన్నాయని చెప్పారు.కేంద్రం విధా నాలను తెలంగాణ ఎట్టి పరిస్థితుల్లో సహించబోదని అన్నారు. ప్రపంచ పెట్టుబడిదారులకు ఇలాంటి నిర్ణయా లు ఇబ్బందికరంగా ఉంటాయని చెప్పారు. సెమీకండక్టర్ ప్రాజెక్ట్ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రైమ్ లొకేషన్ లో 10 ఎకరాల స్థలం కూడా కేటాయించిందని తెలిపారు. ఇదే ప్రాజెక్ట్ కు ఏపీ

వివరాలు 2లో..

## 79వ స్వాతంత్ర్య దినోత్సవం: నేడు జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం

- 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రేపు జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం
- ఎల్లుండి ఎర్రకోట నుంచి ప్రసంగించనున్న ప్రధాని నరేంద్ర మోదీ
- దేశ రాజధాని ఢిల్లీలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- పలు కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధింపు
- ఉదయం 4 గంటల నుంచే మెట్రో ప్రత్యేక సర్వీసులు
- సాయుధ బలగాల బ్యాండ్ ప్రదర్శనలతో దేశభక్తి వాతావరణం

హైదరాబాద్ పెన్ పవర్: :దేశవ్యాప్తంగా 79వ స్వాతంత్ర్య దినో త్సవ వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఈ వేడుకలను పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం (ఆగస్టు 14) జాతినుద్దేశించి ప్రసంగిం చనున్నారు. సాయంత్రం 7 గంటలకు

వివరాలు 2లో..



## ప్రభుత్వ అసమర్థత కారణంగా అంతర్జాతీయ స్థాయి ఎకో పార్క్ పనులు నిలిచిపోయాయి

- కొత్వాల్ గూడ ఎకో పార్క్ ఆలస్యంపై కేటీఆర్ ఫైర్
- రేవంత్ ప్రభుత్వం ప్రజా సేవను పక్కన పెట్టిందని మండిపాటు
- నిస్సహాయ ప్రభుత్వంలో నిస్సహాయ పాలన సాగుతోందని విమర్శ



హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ కొత్వాల్ గూడ ఎకో పార్క్ ఆలస్యంపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్ ప్రభుత్వం ప్రజా సేవను పక్కన పెట్టి రాజకీయాలు, ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తోందని విమర్శించారు. ప్రభుత్వ అసమర్థత వల్లే కొత్వాల్ గూడ ఎకో పార్క్ పనులు నిలిచిపోయాయని అన్నారు. రెండేళ్ల క్రితమే ఎకో పార్క్ మెజార్టీ పనులను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పారు. హైదరాబాదీల

వివరాలు 2లో..

## కోదండరామ్, అలీఖాన్ల నియామకంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

- నియామకాలపై స్టే విధించిన సుప్రీంకోర్టు
- గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియామకం
- తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపిక ఉండాలన్న సుప్రీంకోర్టు





వివరాలు 2లో..

## భారత్-రష్యా మైత్రి.. మాస్కోలో జైశంకర్, లావ్రోవ్ కీలక భేటీ

- మాస్కోలో జైశంకర్, లావ్రోవ్ భేటీకి రంగం సిద్ధం
- ఆగస్టు 21న జరగనున్న కీలక సమావేశం
- ద్వైపాక్షిక, అంతర్జాతీయ అంశాలపై చర్చలు
- ఇటీవలే ముగిసిన అజిత్ దోవల్ రష్యా పర్యటన
- కొనసాగుతున్న ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయి చర్చలు
- భారత్కు రానున్న రష్యా అధ్యక్షుడు పుతిన్



వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# డెంగీ కంగారొద్దు

వానాకాలం రాగానే దోమలు విజృంభిస్తుంటాయి. వీటితో పాటే జ్వరాలూ చెలరేగుతుంటాయి. వీటిల్లో డెంగీ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఎందుకంటే చాలామంది ప్లేట్‌లెట్ల గురించి తీవ్ర ఆందోళన చెందుతుంటారు. నిజానికి అంత కంగారు అవసరం లేదు. అందరికీ ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సిన అవసరం రాదు. చాలావరకూ మామూలు చికిత్సతోనే జ్వరం తగ్గుతుంది. కాబట్టి డెంగీ తీరుతెన్నులు, చికిత్స, నివారణ మీద సరైన అవగాహన కలిగుండటం తప్పనిసరి.

**ఒక రకంతో ఒకసారే కానీ..**

ఈడిస్ జాతి దోమలు కుట్టటం ద్వారా డెంగీ వైరస్‌లు వ్యాపిస్తాయి. దోమ కుట్టిన 3-14 రోజుల్లో ఎప్పుడైనా ఇన్‌ఫెక్షన్ తలెత్తొచ్చు. ఈ వైరస్‌లలో ప్రధానంగా నాలుగు రకాలున్నాయి. ఒక రకంతో ఒకసారే ఇన్‌ఫెక్షన్ వస్తుంది. అయితే మరో రకం వైరస్‌తో రెండోసారి వస్తే తీవ్రంగా ఉంటుంది. మొదటి రకం వైరస్‌ను ఎదుర్కోవటానికి పుట్టుకొచ్చిన యాంటీబాడీలు రెండో రకం వైరస్‌ను కణాల్లోంచి నిర్మూలించ లేవు. దీంతో ఇన్‌ఫెక్షన్ చాలా తీవ్రంగా ఉంటుంది. కాబట్టే తగు జాగ్రత్త అవసరం. ఎవరికైనా నాలుగు వైరస్‌లతో నాలుగు సార్లు డెంగీ వస్తే జీవితంలో మళ్లీ ఎప్పుడూ వచ్చే అవకాశమే ఉండదని చెప్పుకోవచ్చు.

**మామూలు చికిత్సతోనే**

ఒక మాదిరి డెంగీ జ్వరానికి పారాసిటమాల్ మాత్రలే సరిపోతాయి. అలాగే ఓఆర్ఎస్ పొడి కలిపిన నీళ్లు తాగుతుండాలి. వాంతులవుతుంటే వీటిని తగ్గించే మందులూ అవసరం. చాలామందికి దీంతోనే డెంగీ నయమవుతుంది.

**ఆసుపత్రిలో ఎప్పుడు?**

మామూలు చికిత్సతో తగ్గకపోయినా, తీవ్ర డెంగీ లక్షణాలు కనిపిస్తున్నా ఆసుపత్రిలో చేర్చి, చికిత్స చేయాలి. రక్తం చిక్కబడటంతో డెంగీ తీవ్రదశ మొదలవుతుంది. ఇది సాధారణంగా 24-48 గంటల వరకూ కొనసాగుతుంది. ఆ తర్వాత దానంతటదే కుదురుకుంటుంది. కానీ కొందరికి గంటల్లోనే పరిస్థితి విషమించొచ్చు. కాబట్టి రక్తం చిక్కదనాన్ని తెలిపే హిమటోక్రిట్/ప్యాక్డ్ సెల్ వాల్యూమ్, ప్లేట్‌లెట్ల సంఖ్యను తెలిపే రక్త పరీక్షలు తరచూ చేస్తూ జాగ్రత్తగా కనిపెట్టుకోవాల్సి ఉంటుంది. ఊపిరితిత్తుల్లోకి ప్లాస్మా ద్రవం లీకై, ఆయాసం వస్తుంటే వెంటిలేటర్ అమర్చి చికిత్స చేయాల్సి ఉంటుంది.

**ప్లేట్‌లెట్లు పడిపోయినా..**

ప్లేట్‌లెట్లు 40 వేలకు, 30 వేలకు పడిపోయా యని అతిగా గాబరా పడొద్దు, భయపడొద్దు. ఎందుకంటే డెంగీలో ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గటం వల్ల మరణించటం చాలా అరుదు. అందరికీ వీటిని ఎక్కించాల్సిన అవసరం లేదు.

ప్లేట్‌లెట్ల సంఖ్య లక్ష కన్నా తగ్గినప్పుడు డాక్టర్ల పర్యవేక్షణలో ఉండాలి. 50వేల కన్నా తక్కువకు పడిపోతే నిశితంగా గమనిస్తూ ఉండటం ముఖ్యం.

20 వేల కన్నా తగ్గిపోయి, రక్తస్రావ లక్షణాలు కూడా కనిపిస్తున్నట్టయితే ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సి ఉంటుంది.

అదే 10వేల కన్నా తగ్గితే రక్తస్రావం అయినా, కాకపోయినా ప్లేట్‌లెట్లు ఎక్కించాలి.

ప్లేట్‌లెట్లను ఇతర రక్త పదార్థాల మాదిరిగా ఫ్రిజ్‌లో నిల్వ చేయలేం. అందువల్ల దూర ప్రాంతాల నుంచి సరఫరా చేసి, ఎక్కించే క్రమంలో కొన్నిసార్లు బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లు తలెత్తొచ్చు. కొందరికివి రక్తంలోకి విస్తరించి, ప్రాణాపాయమూ సంభవించొచ్చు.

**చేయకూడనివి**

కార్టికోస్టిరాయిడ్లు ఇవ్వద్దు. ఇవి పేగుల్లో రక్తస్రావం, గ్లూకోజు బాగా పడిపోవటం, రోగనిరోధకశక్తి తగ్గటానికి దారితీస్తాయి.

డెంగీకి ప్రత్యేకించిన యాంటీ వైరల్ మందులేవీ లేవు. వైరల్ ఇన్‌ఫెక్షన్లకు యాంటీబయాటిక్స్ పనిచేయవు కాబట్టి వీటిని వాడొద్దు.

ముందుజాగ్రత్తగా ప్లేట్‌లెట్లు ఎక్కిస్తే ప్రయోజనం లేదు. ఇది తీవ్ర డెంగీ ముప్పునేమీ తగ్గించదు. పైగా ద్రవాల మోతాదు పెరిగి, ఎక్కువరోజులు ఆసుపత్రిలో ఉండాల్సి వస్తుంది.

అనవసరంగా సెలైన్ ఎక్కించొద్దు. నోటితో ద్రవాలు తీసుకోలేకపోతున్నా, రక్తంలో హిమోగ్లోబిన్ శాతం ఎక్కువున్నా, రక్తపోటు బాగా పడిపోయినా సెలైన్ అవసరం. అదీ తగినంత మోతాదులోనే ఎక్కించాలి. మూత్రం తగినంతగా వస్తున్నా, రక్తం పలుచగా అవుతున్నా సెలైన్ మోతాదు తగ్గించాలి.

**లక్షణాలు ఇవీ..**

డెంగీ వైరస్ సోకినా అందరికీ జ్వరం రాకపోవచ్చు. ఓ 10% మందిలోనే ఇన్‌ఫెక్షన్‌గా మారుతుంది. దీంతో ఉన్నట్టుండి తీవ్రమైన జ్వరం.. అతి తీవ్రంగా, తల పగిలిపోతోందేమో అన్నంత తలనొప్పి.. కళ్ల వెనక నొప్పి, వాంతి, వికారం, ఒళ్లు నొప్పులు, నడుం నొప్పి, కీళ్ల నొప్పులు, ఆకలి తగ్గటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలామందికి ఒకట్రెండు లక్షణాలతోనే ఆగిపోవచ్చు కూడా. కొందరు తీవ్రదశకు చేరుకోవచ్చు.

**ఆ సమయాల్లో..**

దోమలు ఎప్పుడైనా కుట్టొచ్చు గానీ ఉదయం 6-8 గంటలు, సాయంత్రం 4-6 గంటల మధ్యలో ఎక్కువగా కుడతాయి. కాబట్టి ఈ సమయాల్లో మరింత జాగ్రత్తగా ఉండాలి.

**బొప్పాయితో జాగ్రత్త**

ప్లేట్‌లెట్లు పెరగటానికి కొందరు బొప్పాయి ఆకుల రసం తాగిస్తుంటారు. ఇది మంచి పద్ధతి కాదు. ఆకు రసంతో పేగుల్లో పుండ్లు పడే అవకాశముంది. అదేపనిగా బొప్పాయి, కివీ వంటి పండ్ల రసాలు తీసుకోవటమూ తగదు. ఇవి మితిమీరితే పొటాషియం మోతాదు ఎక్కువై, రక్తపోటు పడిపోవచ్చు.

**హెచ్చరిక సంకేతాలు ఇవీ..**

డెంగీలో జ్వరం తగ్గాకే అసలు ప్రమాదం మొదలవుతుంది. ప్లేట్‌లెట్లు తగ్గటం, రక్తనాళాల్లోంచి ద్రవం లీకవటం, రక్తంలో హిమోగ్లోబిన్ పెరగటం, రక్తం చిక్కబడటం అప్పుడే ఆరంభమవుతుంది. దీంతో మెదడు, కాలేయం, గుండె, ఊపిరితిత్తుల వంటి కీలక అవయవాలు దెబ్బతినటం, షాక్ సిండ్రోమ్ వంటి తీవ్ర అనర్థాలు తలెత్తుతాయి. కాబట్టి హమ్మయ్య జ్వరం తగ్గిందని అనుకోవద్దు. కొన్ని హెచ్చరికలను బట్టి తీవ్రదశ సంకేతాలను పసిగట్టొచ్చు. వీటిని గమనిస్తే ఏమాత్రం నిర్లక్ష్యం చేయొద్దు.

నివారణే ఉత్తమం

**దోమలు కుట్టకుండా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.**

పూల కుండీలు, కూలర్లలలో నీరు ఎప్పటికప్పుడు మారుస్తుండాలి.

నీళ్ల ట్యాంకులు, బకెట్ల వంటి వాటిపై మూత పెట్టాలి.

పాత టైర్లు, కొబ్బరి చిప్పల వంటి వాటిని పారెయ్యాలి.

కిటికీలు, తలుపులకు జాలీలు బిగించుకోవాలి.

పడుకునేటప్పుడు దోమతెరలు వాడుకోవాలి.

బయటకు వెళ్లినప్పుడు పొడుగు చేతుల చొక్కాలు, ప్యాంట్లు ధరించాలి.

కాళ్లకు, చేతులకు దోమలను తరిమే క్రీములు రాసుకోవాలి.

# కుండపోత

- మొదటి పేజీ తరువాయి

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని పోలీస్ కమిష నర్ సునీల్ దత్ సూచించారు. ఇందుకోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేసిన ట్టు తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో 8712659111కు సమాచారం అందించా లని కోరారు.

**వరంగల్.. వరద ఫుల్**

రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరమైన వరంగల్ నిన్న కురిసిన వర్షానికి వరదల్లో చిక్కుకుంది. ట్రైసిటీగా పేరున్న ఈ మహానగరంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. హంటర్ బ్రిడ్జ రోడ్డులోకి భారీగా వరద నీరు చేరడంతో వాహన రాకపోకలకు నిన్న తీవ్ర అంతరాయం ఏర్పడింది. వరంగల్ రైల్వేస్టేషన్లో ఉన్న మూడు పట్టా లైన్లు నీట మునిగి రైళ్ల రాకపోకలకు కొంతసేపు అంతరాయం కలిగింది. కొన్ని ప్రాంతాల్లో వరద నీటిలో చిక్కుకున్న వారిని పోలీసులు రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## బెట్టింగ్ యాప్స్ కేసు: మంచు లక్ష్మిని మూడున్నర గంటలు ప్రశ్నించిన ఈడీ

- మొదటి పేజీ తరువాయి

పలు గేమింగ్ యాప్‌లను సోషల్ మీడియాలో మంచు లక్ష్మీ ప్రమోట్ చేసింది. ఈ క్రమంలో మనీలాండరింగ్ నిరోధక చట్టం నిబంధనల కింద మంచు లక్ష్మీ ఇచ్చే వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. బెట్టింగ్ యాప్ ల నుంచి తీసుకున్న పారితోషికాలు, కమిషన్ లపై ఈడీ అరా తీసినట్టు సమాచారం. చట్టవిరుద్ధమైన యాప్ లకు ప్రమోషన్ ఎందుకు చెయ్యాల్సి వచ్చింది..? అనే కోణంలో ఈడీ విచారించింది.

ఇప్పటికే, ఇదే కేసులో ఈడీ విచారణకు విజయ్ దేవరకొండ, రానా, ప్రకాష్ రాజ్ హాజరైన విషయం తెలిసిందే. ప్రకాశ్ రాజ్‌ను 6 గంటలు, విజయ్ దేవరకొండను 4 గంటలపాటు విచారించారు ఈడీ అధికారులు.

## కోదండరామ్, అలీఖాన్‌ల నియామకంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

- మొదటి పేజీ తరువాయి

తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరామ్, అమీర్ అలీఖాన్ నియామకాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. గవర్నర్ కోటాలో వీరిద్దరినీ తెలంగాణ ఎమ్మెల్సీలుగా నియమించగా, ఈ నియామకాలను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ సంచలన తీర్పును వెలువరించింది. దీంతో వారికి అత్యున్నత న్యాయస్థానంలో ఎదురుదెబ్బ తగిలింది.వారి నియామకాలను నిలిపివేస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకాలను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్ కుమార్, సత్యనారాయణ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఆ పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు నేడు తీర్పును వెలువరించింది. తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపిక ఉండాలని పేర్కొంటూ

గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం సవరించింది. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ప్రమాణ స్వీకారం చేయడం తప్పని సుప్రీంకోర్టు పేర్కొంది.

## అభివృద్ధికి మేం వ్యతిరేకం కాదు..

- మొదటి పేజీ తరువాయి

కూడిన బెంచ్ విచారించింది. ఈ సందర్భంగా తెలంగాణ తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ తన వాదనలు వినిపిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. దీనిపై స్పందించిన సీజేఐ వన్యప్రాణుల రక్షణ, పర్యావరణ పరిరక్షణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. దీనిపై స్పందించిన సీజేఐ వన్యప్రాణుల రక్షణ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన మెరుగైన ప్రతిపాదనతో వస్తే స్వాగతిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక తో ముందుకు వస్తే.. గతంలో చేసిన వ్యాఖ్య లను ఉప సంహరించుకుంటామని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ చెప్పారు.

ఇదే కేసు విచారణలో జస్టిస్ గవాయ్ గతంలో కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎస్ కు జైలు శిక్ష విధిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. పర్యావరణాన్ని ధ్వంసం చేశారని, వన్యప్రాణులను ఇబ్బంది పెట్టారని, అక్కడ జరిగిన నష్టాన్ని పూడ్చాలని లేని పక్షంలో చర్యలు తప్పవంటూ హెచ్చరికలు జారీ చేశారు. ఆ స్థలంలో మొక్కలు నాటాలని మెరుగైన ప్రతిపాదనలతో వస్తే తప్పకుండా అభినందిస్తామని అన్నారు. ఆరు వారాల పాటు సమయం ఇస్తే సమగ్ర నివేదిక ఇస్తామని అభిషేక్ మను సింఘ్వీ తెలిపారు. దీనిపై స్పందించిన సీజేఐ కేసును వాయిదా వేస్తున్నట్టు ప్రకటించి మంచి ప్రతిపాదనలతో రావాలని సూచించారు.

## ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ

- మొదటి పేజీ తరువాయి

విజ్ఞప్తి చేశారు. మిడ్ మానేరు, అన్నపూర్ణ, రంగనాయక్ సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ, బస్వాపూర్ జలాశయాలను నింపాలని కోరారు. రైతుల కోసం ఆరో ప్యాకేజీ వద్ద ఉన్న మోటార్లు ఆన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. జలాశయాల్లో నీరు నింపకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు పేర్కొన్నారు.

**క్యూలో నిలిచిన రైతులు.. ఆగిన హరీశ్ రావు**

హరీశ్ రావు సిద్దిపేట జిల్లాలోని రాఘవాపూర్‌లో పర్యటించారు. ఎరువుల కోసం రైతులు వరుసలో నిలుచొని ఉండటం చూసి ఆయన ఆగారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటీపీ, ఒక బస్తా విధానం తొలగించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం సబ్సిడీ నుంచి తప్పించుకోవడానికి కృత్రిమ కొరతను సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు. ఎన్నికలు ఉన్నందున ఎరువులను బీహార్‌కు తరలిస్తున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు గట్టి గుణపాఠం చెప్పాలని ఆయన అన్నారు.

## 79వ స్వాతంత్ర్య దినోత్సవం: నేడు జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం

- మొదటి పేజీ తరువాయి

ఈ ప్రసంగాన్ని ఆకాశవాణి, దూరదర్శన్ జాతీయ నెట్‌వర్క్‌లలో ప్రసారం చేయనున్నట్టు ప్రభుత్వ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.మొదట హిందీలో, ఆ తర్వాత ఆంగ్లంలో ఈ ప్రసంగం ఉంటుంది. అనంతరం దూరదర్శన్ ప్రాంతీయ ఛానెళ్లలో స్థానిక భాషల్లో ప్రసారం చేస్తారు. ఆకాశవాణి తమ ప్రాంతీయ నెట్‌వర్క్‌లపై రాత్రి 9:30 గంటలకు అనువాద ప్రసంగాలను ప్రసారం చేస్తుంది.శుక్రవారం (ఆగస్టు 15) ఉదయం, ప్రధాని నరేంద్ర మోదీ చారిత్రాత్మక ఎర్రకోట బురుజుల నుంచి సంప్రదాయబద్ధంగా జాతినుద్దేశించి ప్రసంగిస్తారు. 1947లో బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం పొందిన చారిత్రక ఘట్టానికి గుర్తుగా ఏటా ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా జెండా వందనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇండియా గేట్, మండి హౌస్, మథురా రోడ్ వంటి కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. పార్కింగ్ లేబుల్స్ లేని వాహనాలు ఈ మార్గాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. మరోవైపు, వేడుకల్లో పాల్గొనే ప్రజలు, అతిథుల సౌలభ్యం కోసం ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్సీ) ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆగస్టు 15న అన్ని లైన్లలో ఉదయం 4 గంటల నుంచే మెట్రో సేవలు ప్రారంభమవుతాయని డీఎంఆర్సీ వెల్లడించింది. ఉదయం 4 గంటల నుంచి 6 గంటల వరకు ప్రతి 30 నిమిషాలకు ఒక రైలు నడుస్తుందని, ఆ తర్వాత యథావిధిగా సాధారణ షెడ్యూల్ కొనసాగుతుందని తెలిపింది.వేడుకల్లో భాగంగా ప్రజల్లో దేశభక్తిని నింపేందుకు ఢిల్లీలోని పలు ప్రముఖ ప్రదేశాల్లో సాయుధ దళాలు, కేంద్ర సాయుధ పోలీస్ దళాలు (సీఏపీఎఫ్), రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్), నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) బ్యాండ్లతో ప్రత్యక్ష ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

## సెమీకండక్టర్ ప్రాజెక్టుపై తెలంగాణకు కేంద్రం అన్యాయం చేసింది

- మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం ఒక ఎకరా కూడా కేటాయించకపోయినా... కేంద్రం ఆ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని చెప్పారు. రాజకీయ కోణంలో తీసుకున్న నిర్ణయాలు తెలంగాణకు అవమానకరంగా ఉన్నాయని మండిపడ్డారు.

## ప్రభుత్వ అసమర్థత కారణంగా అంతర్జాతీయ స్థాయి ఎకో పార్క్ పనులు నిలిచిపోయాయి

- మొదటి పేజీ తరువాయి

కోసం నిర్మించిన అంతర్జాతీయ పార్క్ ఇది అని కేటీఆర్ అన్నారు. ఈరోజు వరకు పార్క్ పనులు పూర్తి కాని పరిస్థితి నెలకొందని అసహనం వ్యక్తం చేశారు. నగర ప్రతిష్ఠను పెంచే ఈ ప్రాజెక్ట్ ప్రభుత్వ అశక్తత, అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయిందని దుయ్యబట్టారు. నిస్సహాయ ప్రభుత్వ హయాంలో నిస్సహాయ పాలన కొనసాగుతోందని విమర్శించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని హిమాయత్ సాగర్ పక్కన 85 ఎకరాల్లో ఈ పార్క్ ను హెచ్ఎండీఏ అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే ఈ పార్క్ లో పక్షిశాలను ఏర్పాటు చేసి... దాదాపు 1,500 రకాల పక్షులను సేకరించి ఇక్కడి వాతావరణానికి అలవాటు చేస్తున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు ఒక రోజంతా అక్కడే గడిపేలా పలు అడ్వెంచరస్ గేమ్స్ ను కూడా రూపొందిస్తున్నారు. క్లైంబింగ్ వాల్, రోలర్ కోస్టర్, స్కై బ్రిడ్జ, జాయింట్ స్వింగ్, హ్యూమన్ స్లింగ్ షాట్, జిప్ బైక్, 360 డిగ్రీల ఫ్లయింగ్ సైకిల్, రోప్ కోర్స్, బంగా ట్రంప్ లైన్ వంటివి ఇందులో ఏర్పాటు చేయనున్నారు.

## భారత్-రష్యా మైత్రి.. మాస్కోలో జైశంకర్, లావ్రోవ్ కీలక భేటీ

భారత్, రష్యా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతోంది. ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయి సమావేశాలు, పర్యటనలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలోనే భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ మధ్య మరో కీలక భేటీ జరగనుంది. ఈ నెల ఆగస్టు 21న మాస్కోలో వీరిద్దరూ సమావేశం కానున్నారు. ఈ విషయాన్ని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం అధికారికంగా ధృవీకరించింది. ద్వైపాక్షిక ఎజెండాలోని ముఖ్యమైన అంశాలతో పాటు, అంతర్జాతీయ వేదికలపై సహకారం గురించి ఇరువురు నేతలు చర్చిస్తారని ఒక ప్రకటనలో తెలిపింది.ఇటీవల భారత జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ మాస్కోలో పర్యటించిన కొద్ది రోజులకే ఈ సమావేశం జరగనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. తన పర్యటనలో దోవల్... రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగు, ఇతర ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు.గత కొంతకాలంగా జైశంకర్, లావ్రోవ్ పలు వేదికలపై సమావేశమవుతూనే ఉన్నారు. గత నెలలో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా, జూలై 15న జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) విదేశాంగ మంత్రుల సమావేశం సందర్భంగా కూడా వీరిద్దరూ చర్చలు జరిపారు. పశ్చిమాసియా, బ్రిక్స్, ఎస్‌సీఓ వంటి అంశాలతో పాటు ద్వైపాక్షిక సహకారంపై మంతనాలు జరిపారు.ఈ ఏడాది మార్చి 7న భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సైతం మాస్కోలో పర్యటించి రష్యా డిప్యూటీ విదేశాంగ మంత్రితో సంప్రదింపులు జరిపారు. ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయిలో తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతిని సమీక్షించారు.ఇదిలా ఉండగా, ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ త్వరలో భారత్‌లో పర్యటించే అవకాశం ఉంది. ఇరు దేశాల నేతల మధ్య వార్షిక సమావేశాల సంప్రదాయాన్ని కొనసాగించేందుకు ఈ పర్యటనకు సన్నాహాలు జరుగుతున్నాయి.

## ఏపీ ఎన్నికలపై జగన్ వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ

- మొదటి పేజీ తరువాయి

ఓడిపోయినా జగన్ ఆలోచనా విధానం మారలేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏమైనా తప్పులు జరిగినట్లు భావిస్తే ఎన్నికల కమిషన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీని విమర్శించవచ్చని, కానీ రాహుల్ గాంధీని తప్పుపట్టడమేమిటని ఆయన

ప్రశ్నించారు. విజయవాడలో ధర్నాలో రాహుల్ గాంధీతో కలిసి జగన్ పాల్గొనాలని సూచించారుబుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో జగన్... రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డికి సాన్నిహిత్యం ఉండటం వల్ల ఆయన ఆంధ్రప్రదేశ్ ఎన్నికల గురించి మాట్లాడలేదని జగన్ ఆరోపించారు.

# నాటు కోళ్ల పెంపకంతో ఆర్థిక అభివృద్ధి





**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 13**:నాటు కోళ్ల పెంపకం తో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని అలాగే వాటి గుడ్లు మాంసం తినడం వల్ల ఆరోగ్యం కరంగా ఉండవచ్చని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ షరీఫ్ అన్నారు. మారేడుమిల్లి మండలం సున్నంపాడు గ్రామంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ షరీఫ్ , హిపర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ గణేష్, నవజీవన్ ఆర్గనైజేషన్ బిజినెస్ డెవలప్మెంట్ ఆఫీసర్ నాగేశ్వరరావు చేతుల మీదుగా ఎఫ్ ఐ జి గ్రూపు రైతులకు ఆసిల్ కోడి పిల్లలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిడి షరీఫ్ మాట్లాడుతూ ఇలాంటి ప్రోగ్రాములు ఈ గిరిజన ప్రాంతంలో చేయడం చాలా ఆనందదాయకం ఉందని మా పశుసంవర్ధక శాఖ తరపున ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామని అన్నారు. డాక్టర్ గణేష్ మాట్లాడుతూ పేజ్ టూ లో భాగంగా రంపచోడవరం మండలంలో 24 గ్రామాల్లో 129 మంది రైతులకు, మారేడుమిల్లి మండలంలో 10 గ్రామాల్లో 124 మంది రైతులకు ఈ ఆసిల్ నాటు కోడి పిల్లలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఒక్కొక్క రైతుకు 20 కోడి పిల్లలు 52 కేజీల మేతను హిపర్, పిజి పి ఎల్ నవజీవన్ సంస్థల ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే పేజీ త్రీ లో భాగంగా గంగవరం వై.రామవరం అడ్డతీగల మండలాలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ పి ఓ సెక్రెటరీ కురసం బాపన్న దొర, నవజీవన్ ఆర్గనైజేషన్ సిబ్బంది బాబురావు, చిన్నాలు దొర, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# చిన కొండేపూడి పీఏసీఎస్ చైర్మన్ డైరెక్టర్ల పదవి స్వీకారం



**సీతానగరం, పెన్ పవర్, ఆగస్టు 13**:సీతానగరం మండలంలోని చిన కొండేపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతిసంఘం చైర్మన్ డైరెక్టర్లు బుధవారం కూటమి నాయకులు కార్యకర్తల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు, సొసైటీ చైర్మన్ గా కాంద్రు శేఖర్, డైరెక్టర్లుగా పప్పుల సురేష్, వడ బల్లిపద్మనాభం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కాంద్రు శేఖర్ మాట్లాడుతూ తమకు అప్పగించిన బాధ్యతలను శిరసావహిస్తూ రైతాంగానికి తమ శక్తి వంచన లేకుండా పనిచేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు వారిని దుశ్శాలు వాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగవరం గ్రామ సర్పంచ్ సంగన చిన పోసియ్య, టిడిపి అధ్యక్షుడు గెద్దం తిమ్మారావు, గంటా రామకృష్ణ, వలవల రాజా, పెందుర్తి అచ్యుత రామారావు, వ్యవసాయ శాఖ అధికారు లు తదితరులు పాల్గొన్నారు,

# ప్రమాదాలకు నిలయంగా మారిన ఏటుగట్టు రహదారి





**సీతానగరం, పెన్ పవర్, ఆగస్టు,13**:సీతానగరం మండలంలోని అధ్వానంగా మారిన పురుషోత్తపట్నం వెళ్లే ఏటిగట్టు రహదారిపై నిత్యం ప్రమాదాల బారిన పడుతూ ఆసుపత్రి పాలవుతున్నారు, రామచంద్రపురం గ్రామ శివారులో మెగా కంపెనీకి చెందిన బొలెరా వాహనం రహదారిపై ఉన్న గోతుల వద్ద పంట పొలాల్లోకి బోల్తా పడిన సంఘటన చోటుచేసుకుంది. అదేవిధంగా సింగవరం గ్రామ సమీపంలో ర్యాంపు ఎక్కుతున్న రైస్ మిల్ ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టడంతో గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకుని బోల్తాపడిన ఆటోను లేపి ప్రక్కకు నెట్టారు. ఆటోలో ఉన్న ఒక వ్యక్తికి స్వల్ప గాయాలు కావడంతో అనంతరం జనసేన అంబులెన్స్ లో ఆస్పత్రికి తరలించారు.మండలంలోని పలు ప్రాంతాల్లో అధ్వానంగా మారిన గోతుల వద్ద వాహనాలు బోల్తాపడడంతో ప్రమాదాల జరుగుతున్నాయని తక్షణమే అధికారులు ప్రభుత్వం స్పందించి రోడ్డుల మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల ప్రాణాలకు భరోసా కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఆన్లైన్ హాజరు తప్పనిసరి



ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు



**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 13**:పాఠశాలలకు హాజరయ్యే ఉపాధ్యాయులు విద్యార్థుల ఆన్లైన్ హాజరు తప్పనిసరి అని ఏజెన్సీ డిఇఓ మల్లేశ్వరరావు సూచించారు. బుధవారం మండలంలోని సిహెచ్ నెల్లిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. లీఫ్ హాజరును పరిశీలించారు. ఉపాధ్యాయులే డైరీలు లెసన్ ప్లాన్స్ ను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థుల యొక్క సామర్థ్యాలు పరిశీలించి వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకమైన శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న ఎఫ్ వన్ ఎస్సైన్మెంట్ పరీక్షల నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏజెన్సీలో ఎఫ్ వన్ ఎగ్జామ్స్ సజావుగా సాగుతున్నట్లు ఆయన తెలిపారు.

# గంగులయ్యకు చైర్మన్ పదవి పట్ల హర్షం



**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 13:** అరకు పార్లమెంట్ జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ వంపురి గంగులయ్య ను రాష్ట్ర ప్రభుత్వం జానపద కళలు సృజనాత్మక అకాడమీ చైర్మన్ గా నియమించడం పట్ల గంగవరం మండలం జనసేన పార్టీ మండల అధ్యక్షులు కుంజం సిద్దు హర్షం వ్యక్తం చేశారు .జనసేన పార్టీ ఆవిర్భావం నుండి గంగులయ్య పార్టీ బలోపేతం కు కృషి చేస్తూ, నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఆయన సేవలను గుర్తించి చైర్మన్గా నియమించడం అభినందనీయమని జనసేన మండల కమిటీ ప్రకటించింది.ఇలాంటి మంచి నామినేటెడ్ పదవి వచ్చినందుకు గాను గంగవరం మండల జనసేన నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

# సిపిఐ పార్టీ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి.



**ఎటపాక, పెన్ పవర్, ఆగస్టు13**:అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండల కేంద్రంలో ఈనెల 16 ,17 తేదీలలో జరిగే సిపిఐ పార్టీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఇంటింటి ప్రచారాన్ని బుధవారం సిపిఐ పార్టీ నాయకులు చేశారు, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డివిజన్ సహాయ కార్యదర్శి వాసం రాము మాట్లాడుతూ... సిపిఐ పార్టీ వందేళ్లుగా సమ సమాజ స్థాపన కోసమే ప్రజల పక్షాన నిలబడి ఎన్నో పోరాటాలు చేసిందని, కార్మికులు కర్షకులు పక్షాన నిలబడి పోరాటాలు చేయడంలో సిపిఐ పార్టీ ఎప్పుడు ముందుంటుందని, పోరాటాలకు పురిటిగడ్డగా ఎప్పుడు చెప్పుకునే పార్టీ సిపిఐ పార్టీ అని గుర్తు చేశారు, ఏజెన్సీ ప్రాంతాలలోని ఖనిజ సంపదను కాపాడుకోవడంలో గిరిజనుల భూహక్కుల సాధనలో సిపిఐ పార్టీ చేసిన కృషి అమూల్యమని పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కంటే రాజు, సిపిఐ మండల కార్యదర్శి ఏలిసాల నాగరాజు, మాజీ ఎంపీటీసీ ముత్తయ్య, ఏడిద సుబ్బారావు, ములిసేట్టి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# చింతూరు మండల టిడిపి అధ్యక్షుడిగా జమాల్ ఖాన్



**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 13**:చింతూరు మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడిగా జమాల్ ఖాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ ఎం శిరీష దేవి విజయ్ భాస్కర్ మాట్లాడుతూ, పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం దక్కేలా చూస్తామని తెలిపారు. నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేసి, విభేదాలు లేకుండా అభివృద్ధి, సంక్షేమాలను అందిపుచ్చుకునేలా పార్టీని ముందుకు నడిపించాలన్నారు. తర్వాత జరిగిన ఎన్నికల్లో గ్రామ, క్లస్టర్, బూత్ మరియు మండల స్థాయి కార్యకర్తల ఏకగ్రీవ నిర్ణయంతో జమాల్ ఖాన్ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాస్ యాదవ్ ఆయన ఎన్నికను అధికారికంగా ఆమోదించారు. అనంతరం జమాల్ ఖాన్‌ను శాలువాతో సన్మానించారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రతీ కార్యకర్తకు అందుబాటులో ఉండి పార్టీకి మంచి పేరు తీసుకురావడానికి కృషి చేస్తానని జమాల్ ఖాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు విజయ్ భాస్కర్, చింతూరు మాజీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ భూఆక్రమణలపై వార్తలు రాయకుండా మౌనం ఆరోపణలు

- తప్పు చేస్తే సొంత ఆదివాసులనూ వదిలిపెట్టమని స్పష్టం
- ఆదివాసి సమస్యలను విస్మరించే విలేకరులపై చర్యలు
- కుంజా శ్రీను హెచ్చరిక



**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 13:**
ఆదివాసి సమస్యలపై ఉద్దేశపూర్వకంగా వార్తలు ప్రచురించని కొందరు విలేకరులపై తక్షణ చర్యలు తీసుకోవాలని, వారి గుర్తింపులను రద్దు చేసి ఏజెన్సీ ప్రాంతాల నుండి బహిష్కరించాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఐటిడిఏ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలను కొన్ని పత్రికలు విస్మరించగా, ప్రైవేట్ ఈవెంట్స్ మాత్రం హైలైట్ చేశాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ శాఖ భూములపై అక్రమ కట్టడాలు, ఆర్ అండ్ బి, పంచాయతీ, రెవెన్యూ శాఖల భూఆక్రమణలపై తమ ఫిర్యాదులు, స్టేట్మెంట్లు ఇచ్చినా కొందరు విలేకరులు ఉద్దేశపూర్వకంగానే వాటిని ప్రచురించడం లేదని ఆరోపించారు. కొంతమంది విలేకరులు ఆదివాసి వనరులు ఉపయోగించుకుంటూ, భూభాగంలో వ్యాపారాలు చేస్తూ, ఆదివాసి సమస్యలను విస్మరిస్తున్నారని కుంజా శ్రీను ఆరోపించారు. గతంలో తప్పుడు పద్ధతిలో ఉద్యోగాలు పొందిన వారి నుండి డబ్బులు వసూలు చేసిన ఘటనలు తమ దృష్టికి వచ్చాయని, త్వరలో ఆధారాలతో సహా బహిర్గతం చేస్తామని హెచ్చరించారు. ఆదివాసి సమస్యలను కవర్ చేస్తున్న పత్రికా విలేకరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న వారిపైనే తమ ఉద్యమమని, తప్పు చేస్తే సొంత ఆదివాసులనూ వదిలిపెట్టమని ఆయన స్పష్టం చేశారు.

# ఆ వ్యక్తి వల్లే మాకు ప్రాణహాని

- మాకు రావలసిన సొమ్ము ఎగవేసేందుకే మాపై ఆరోపణలు
- ఇన్ని కోట్లు ఎలా సంపాదించారో చెప్పాలి

**గోకవరం, పెన్ పవర్, ఆగస్టు 13 :** మా ఐదుగురి వల్ల ప్రాణహాని ఉందని ఆరోపించిన వ్యక్తి వల్లే మా ఐదుగురికి ప్రాణహాని ఉందని ఇనకోటి బాపన్నదొర,తామర్ల రాంబాబు, మామిడి అయ్యప్ప,కట్టా కళ్యాణ్, కంబాల మురళి లు ఆరోపించారు.బుధవారం గోకవరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.మా స్థలాలను ఇతరులకు అమ్మినదానికంటే తక్కువ ధరకే సదరు వ్యక్తికి అమ్మడం జరిగిందని,ఈ కారణంగా మేమే నష్టపోవలసి వచ్చిందని ఇక మేము కోట్లు ఎలా సంపాదించగలం అంటూ ఇనకోటి బాపన్నదొర ప్రశ్నించారు.మా వ్యాపార భాగస్వాములకు రావలసిన సుమారు ఆరుకోట్ల రూపాయలు జులై నెలలో ఇచ్చేస్తానని వ్రాతపూర్వకంగా వంద రూపాయలు బాండు పేపర్ పై రాసిఇవ్వడమే కాకుండా ఆస్తి పత్రాలను కొన్నింటిని మాకు ఆ వ్యక్తి ఇచ్చారని బాపన్నదొర తెలిపారు.మాకు రావలసిన సొమ్ము ఇవ్వకుండా తిరిగి మాపై ఆవ్యక్తి ఆరోపణలు చేస్తున్నారని కానీ మమ్మల్ని చంపేందుకు సదరు వ్యక్తి బ్లేడ్ బ్యాచ్ వ్యక్తులతో సుపారి మాట్లాడుకున్నారని బాపన్నదొర సంచలన ఆరోపణలు చేశారు.నేను జూదమాడి డబ్బు సంపాదించానని సదరు వ్యక్తి ఆరోపణలు చేశాడని,నేను జూదమాడే డబ్బు సంపాదించానని అయితే సదరు వ్యక్తి అన్ని కోట్లు ఎలా సంపాదించాడో చెప్పాలని,ఆయన సంపాదనపై అధికారులు ఆరా తీయాలని తామర్ల రాంబాబు కోరారు. స్థానిక దేవీ చౌక్ అమ్మవారి సొమ్ము నేను వాడుకున్నానని ఆరోపణలు చేసిన వ్యక్తి, వాటిని వ్రాతపూర్వకంగా నిరూపించాలంటూ మామిడి అయ్యప్ప డిమాండ్ చేశారు. అమ్మవారి సొమ్ములకు సంబంధించిన ఖర్చులకు సంబంధించిన వివరాలను మామిడి అయ్యప్ప మీడియా ముందు ఉంచారు.ఇంటిపేరు మార్చుకుని చలామణి అవుతున్న వ్యక్తి నాపై రైస్ పుల్లింగ్ కేసు,నకిలీ నక్సలైట్ కేసు అంటూ ఆరోపణలు చేస్తున్నారని అయితే ఆ కేసుల్లో నేను నిర్దోషిగా కోర్టు తీర్పు ఇచ్చిందని సదరు వ్యక్తి అక్రమ సంపాదనకు సంబంధించిన వివరాలను రెండు రోజుల్లో బయటపెడతానని,ఇకపై ఆ వ్యక్తి ఇంటి పేరు మార్చుకుని ఫ్లెక్సీలు ఏర్పాటుచేస్తే వాటిని తగలబెట్టేస్తానని కంబాల మురళి అన్నారు.మాకు రావలసిన సొమ్ము మాకు ఇచ్చేస్తే మా మధ్య ఎటువంటి వివాదాలు ఉండబోవని ఇనకోటి బాపన్నదొర, తామర్ల రాంబాబు, మామిడి అయ్యప్పలు అన్నారు.



## ఎయిడ్స్ నియంత్రణ పై 2 రోజులు శిక్షణ

- అదనపు డిఎంహెచ్వో భరతలక్ష్మి






**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 13:** రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఏరియా ఆసుపత్రి నందు ఏ.ఆర్.టి పని చేస్తున్న కౌన్సెలర్స్ కు హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులను గుర్తించుట రక్త పరీక్షల నిర్వహణ అనే అంశం పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు అదనపు డి ఎం అండ్ హెచ్ ఓ భరత లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్.ఐ.వి పరీక్షల శాతం పెంచాలని, ప్రతీ హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుని నుండి నలుగురి బాగస్వాములను గుర్తించి, వారికి హెచ్.ఐ.వి పరీక్షలు నిర్వహించి, వారి నుండి వేరొకరికి హెచ్.ఐ.వి వ్యాధి శోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు రు, ఈ కార్యక్రమ%శీ% లో డా. ఐ. ప్రభాకర రావు,జిల్లా లెప్రసి ఎయిడ్స్, టీబీ అధికారి ఆదిలింగం, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్, ఏ.హరినాధ కుమార్, క్లినికల్ సర్వీస్ ఆఫీసర్, శ్రీ. జాన్ ప్రోగ్రామ్ కొ-ఆర్డినేటర్, వి.హెచ్.ఎస్ బాలాజీ పి. సిబ్బంది పాల్గొన్నారు.

## కాజులూరులో నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ కార్యక్రమం

**కాజులూరు, పెన్ పవర్,ఆగస్టు 13:**కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఇంచార్జి ప్రిన్సిపాల్ ఎం. చి. శ్రీనిబాబు మాట్లాడుతూ, యువత మాదకద్రవ్యాలకు బానిస కావడం దేశ భవిష్యత్‌కి ప్రమాదకరమని, ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాల నుంచి దూరంగా ఉండాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ శ్రీమతి శ్రీదేవి విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా డి సి పి యు సోషల్ వర్కర్ ఎస్. చినబాబు, జి ఎం ఎస్ కెవిజయ నిర్మల, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ప్రతిజ్ఞలో పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



తాసిల్దార్ శ్రీనివాసరావు

**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 13:**రానున్న నాలుగు రోజులు మండలంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని గంగవరం తాసిల్దార్ సిహెచ్ శ్రీనివాసరావు సూచించారు. వాతావరణ శాఖ సూచనలు మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాసిల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలంలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. బట్టి నివాసాలు పాతబడిన కట్టడాలలో ఎవరో నివాస ఉండరాదని ఆయన హెచ్చరించారు. ఈ నెల 17 వరకు అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు సెలవులు రద్దు చేయడం జరిగిందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ముందస్తు అనుమతి లేకుండా ఉద్యోగులు హెడ్ క్వార్టర్స్ వదిలి వెళ్ళరాదని తెలిపారు. మండల స్థాయి గ్రామ సచివాలయం ప్రభుత్వ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎటువంటి రానా ఆస్నాష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. సూరంపాలెం రిజర్వాయర్ ప్రాజెక్టు వద్దకు సందర్శకులు వెళ్లకుండా, అలాగే ప్రాజెక్టు పరిసరాల్లో చేపల వేటను ఆదివారం వరకు నిషేధించడం జరుగుతుందని చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్ ఆదేశించారు.

## హర్ ఘర్ తిరంగా ర్యాలీ. ఉత్సాహంగా నిర్వహణ



**పెన్ పవర్ హుకుంపేట , ఆగస్టు 13:** హుకుంపేట మండల కేంద్రంలో హర్గర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. హుకుంపేట జ్ఞాన సాగర్ కళాశాల మరియు ప్రభుత్వ కళాశాల మరియు వివిధ పాఠశాల విద్యార్థులతో హర్గర్ధిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. భారత్ మాతాకీ జై. అంటూ నినాదాలు చేస్తూ దేశభక్తిని చాటారు. అలాగే దేశం కోసం త్యాగాలు చేసిన మహానీయు లను వారి సేవలను స్మరించుకుంటూ, వారి అడుగు జాడల్లో నడుచుకోవాలని ర్యాలీలో పాల్గొన్న వారు అన్నారు. మాతృభూమి రుణం తీర్చుకునే విధంగా. ప్రతి పౌరుడూ తన వంతు బాధ్యతను నిర్వర్తించాలి, అని సందేశాన్ని చాటారు . ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ స్కూల్ విద్యార్థులు టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# చించినాడ బ్రిడ్జి మరమత్తులకై ట్రాఫిక్ నిలుపుదల

**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 13:** దిండి-దిగమర్రు జాతీయ రహదారి 216 బేరింగ్ రీప్లేస్‌మెంట్ మరమ్మత్తు పనుల నిమిత్తం పనుల చించినాడ వంతెన వద్ద ట్రాఫిక్ ఈనెల 18, 21 తేదీ లలో రెండు రోజులపాటు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు పూర్తిగా ట్రాఫిక్కు ను నిలుపుదల చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జాతీయ రహదారి ఆథారిటీ అధికారులు, రోడ్డు కాంట్రాక్టర్ బేరింగ్‌ల కొలతలు , స్లీవ్ స్థానాల ధృవీకరణ కోసం స్పాన్‌లను ఎత్తివేయాలని ప్రతిపాదించారని, ఆ దిశగా ఈనెల 18 21 తేదీలలో రెండు రోజుల పాటు పూర్తి ట్రాఫిక్ నిలుపుదల కోసం అభ్యర్థించారన్నారు.ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని, ట్రాఫిక్ నిలు పుదల సమయంలో వాహనాల రాకపోకలను సజావుగా మళ్లించడం, నిర్వహించడం కోసం సంబంధిత విభాగాలు మరియు వాహన దారులకు అవసరమైన సూచనలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఈ ట్రాఫిక్కు పూర్తి స్థాయి నిలుపుదల కొరకు సంబంధిత విభాగాలు పూర్తి సమన్వయం వహించాలని, వాహనదారులు కూడా అధికారులకు పూర్తి గా సహకరించాలని ప్రకటన ద్వారా జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



# కోనసీమను అగ్రస్థానంలో నిలపండి




కలెక్టర్ మహేష్ కుమార్

**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 13 :**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యార్థులు ఇన్స్పైర్ మానక్ నామినేషన్లు సమర్పించడంలో చురుకుగా పాల్గొని, 3000 ప్రాజెక్టుల లక్ష్యంతో జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్, పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇన్స్పైర్ మానక్ భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులలో విజ్ఞాన ఉత్సాహం, సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలను పెంపొందించేందుకు రూపొందించబడిన జాతీయ స్థాయి కార్యక్రమమని వివరించారు.

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, మరియు ఉపసంస్థల ఆధ్వర్యంలోని అన్ని పాఠశాలల నుండి విద్యార్థులు తప్పనిసరిగా నామినేషన్లు పంపాలని, నామినేషన్లకు చివరి తేదీ సెప్టెంబర్ 15 అని తెలిపారు. ప్రతి పాఠశాల కనీసం ఒక ఆవిష్కరణను సమర్పించడం లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు.

స్థానిక సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాల రూపంలో వచ్చిన ఆవిష్కరణలకే ప్రాధాన్యం ఇస్తామని, ఎంపికైన ఉత్తమ ఆవిష్కరణల విద్యార్థులకు రూ.10,000 నగదు బహుమతి లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. 3000 నామినేషన్లు సమర్పించడం ద్వారా కోనసీమ జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవగలదని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మార్గదర్శకత మరియు పూర్తి వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం ( 9640188525) ని సంప్రదించవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమానికి సంబంధించిన అవగాహన పోస్టర్‌ను ఈ రోజు కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్, ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీమతి జి.మమ్మి, జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ దుర్గారావు దొర, వివిధ సెక్టోరియల్ ఆఫీసర్లు,మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు, జిల్లా విద్యాశాఖ ప్రముఖులు పి. రామలక్ష్మణమూర్తి, గుబ్బల సూర్యప్రకాశం పాల్గొన్నారు.కార్యక్రమాన్ని జిల్లా సైన్స్ అధికారి జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం సమన్వయం చేశారు.

# వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలి







గంగవరం ఎస్ఐ వెంకటేష్

**గంగవరం ,పెన్ పవర్ ,ఆగస్టు 13:**మండలంలో కురుస్తున్న వర్షాల కారణంగా రహదారులపై చెట్లు పడిపోయే అవకాశం ప్రయాణ సమయంలో వాహనాలు జారిపోయే అవకాశం ఉన్నందున వాహనదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని గంగవరం ఎస్ఐ వెంకటేష్ సూచించారు. రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున కొండ వాగులు ఉధృతంగా ప్రవహిస్తాయని ప్రజలు ఎవరు వాగులను దాటువద్దని సూచించారు. సూరంపాలెం రిజర్వాయర్ వద్ద సందర్శకులకు టూరిస్టులకు అనుమతి లేదని ఎవరు ప్రాజెక్టు పరిసరాల్లో సంచరించవద్దని హెచ్చరించారు అలాగే ప్రాజెక్టు పరిసరాలు చేపలు వేటను నిషేధించడమైనది అన్నారు. నెల్లిపూడి గ్రామ శివారులో గల కల్వర్టు పై నుండి వాగు నీరు ప్రవహించే అవకాశం ఉన్నందున ప్రజల అప్రమత్తంగా ఉండాలని వాగు వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు. పెద్ద గార్లపాడు సమీపంలో రహదారికి అడ్డుగా చెట్టుకొమ్మలు పడడంతో వాటిని పోలీసు సిబ్బంది గ్రామస్తులు సహకారంతో తొలగించారు అలాగే నెల్లిపూడి గ్రామ శివారులోని కల్వర్టు వద్ద వాహనదారులను అప్రమత్తం చేశారు.

## మాదకద్రవ్య రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ నడుంబిగించాలి.

-జగ్గంపేట ఐసిడిఎస్, సిడిపిఓ, ఎం పూర్ణిమ.

**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు13:** మాదకద్రవ్య రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని జగ్గంపేట ఐసిడిఎస్,సిడిపిఓ, ఎంపూర్ణిమ అన్నారు.బుధవారం కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ బావిశెట్టి హరికృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ తోట రవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జడ్పిటిసి తోట గాంధీ ,కిర్లంపూడి సొసైటీ చైర్మన్, కుర్ల చినబాబు,వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, పాల్గొన్న ఈ సమావేశంలో ఐసిడిఎస్, సిడిపిఓ, ఎం పూర్ణిమ మాట్లాడుతూ నేటి యువత మాదకద్రవ్యాల బారిన పడి చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోయి, తమ కుటుంబాలు చిన్నాభిన్నం అవ్వడానికి కారకులవుతున్నారని ఎం పూర్ణిమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులచే ఎం పూర్ణిమ ప్రతిజ్ఞ చేయించారుఈ కార్యక్రమంలో డిప్యూటీ తహాసిల్దార్ సాయి కిరణ్, పంచాయతీరాజ్ శాఖ డీఈ, వై ఉమా శంకర్, ఎంఈఓ, టి జోషెఫ్, వైద్యాధికారులు అభిషేక్,స్వాతి,కంటా శ్రీను,పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపును సదా స్వాగతించి

- వేముల వలసలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ
- స్వాతంత్ర్య స్ఫూర్తి నింపిన వైనం



**బిమిలి, పెన్ పవర్, ఆగస్టు. 13 :**మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపును సదా స్వాగతించి,, ఆనందపురం మండలం వేములవలస గ్రామంలో హర్ ఘర్ తిరంగ యాత్ర మండల అధ్యక్షులు పిల్లా విజయ ఆద్వర్యంలో ఎంతో వైభవం గా జరిగింది. మన దేశ స్వాతంత్ర దినోత్సవం రెండు రోజుల ముందే వచ్చిందా అన్నట్టుగా కన్నులవిందు చేసింది.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా దానేష్ , చక్రవర్తి , దక్షిణామూర్తి , ఉప్పాడ అప్పారావు , రామలక్ష్మి , తాట్రాజు అప్పారావు , కోరాడ నవీన్ , ఎస్ నాయుడు పాల్గొని విజయవంతం చేశారు. అందులో భాగం గా మండల బీజేపీ వర్గం తో పాటు ప్రసాద్ రావు పట్నాయక్, మీసాల రామునాయుడు, గండ్రెడ్డి వెంకటరావు, పిల్లా సూర్యనారాయణ, పోతిన జీవన్,డి.పి. జె.ఎస్.వి రత్నం,అడ్డూరి సురేష్, మాదబతుల బుజ్జి,అడ్డూరి ఆనంద్ రవి, సీతం నాయుడు, దంతులూరి సుధాకర్ వర్మ, కే.వి.యన్ కృష్ణారా వు(గోపి), ఇల్లిపిల్లి వెంకట్, సీపాన సరిత, ఎస్.ఏ నరసింహరావు, ఇల్లిపిల్లి అచ్యుత్, పొన్నాడ శ్యామలరావు తదితరులు పాల్గొన్నా రు.మన జాతి ఔన్నత్యాన్ని మువ్వన్నెల జెండాతో చాటి చెప్పారు.చివరగా మహాత్మ గాంధీ విగ్రహానికి, డా.అంబేద్కర్ విగ్రహానికి పూల మాలతో అలంకరించారు.

ఈ కార్యక్రమంలో భాగస్వాములై మన ప్రధాని పిలుపును గౌరవించి వాలంటీర్ గా విచ్చేసిన సోదర, సోదరిమనులకి అలాగే శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల యాజమాన్యం కు, శ్రీ వెంకటేశ్వర స్కూల్ యాజమాన్యం కు ప్రత్యేక ధన్యవాదములు.

## మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 13:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండల కేంద్రంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, స్థానిక సర్పంచ్ కొర్ర సుభద్ర ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, జీకే వీధి సచివాలయం సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్వైజర్లు వలసమ్మ, మోహిని, పంచాయతీ సెక్రెటరీ కిట్లంగి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బూర్జ అరకులోయలో విలీనం చెయ్యండి.




**అరకులోయ పెన్ పవర్ 13:**అరకులోయ నియోజకవర్గం హుకుంపేట మండలం బూర్జా గ్రామపంచాయతీ అరకులోయ మండలానికి సమీపంలో సుమారు 15 కిలోమీటర్ల దూరంలో బూర్జ గ్రామం కలిగి ఉంది. అయితే మండలాలు విభజనలో భాగంగా బూర్జ గ్రామపంచాయతీ అరకులోయ మండల కేంద్రానికి వీలినం చేయాలని స్థానిక గ్రామస్తులు బుధవారం నిరసన తెలియజేశారు. అనంతగిరి, డుంబ్రిగూడ, హుకుంపేట, కించుమండ, దమ్ముకు, ప్రధాన రహదారి మండల కేంద్రాలకు చేరుకోవాలంటే వయ్య అరకులోయ మండల కేంద్రం నుండి ప్రయాణించవలసి వస్తుందని గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. మండలాలు విస్తరణలో భాగంగా మారుమూల గ్రామలైన బూర్జ, బస్కి, వాళ్లసి, వేంగడా, పైనంపాడు, గత్తుమ్, పట్టం, గ్రామా పంచాయతీలు కలిపి నూతన మండలంగా మండలం ఏర్పాటు చేస్తే దూర భారం తగ్గుతుందని, ప్రయాణానికి సమయం మిగులుతుందని, బూర్జ గ్రామ గిరిజనులు విజ్ఞప్తి చేశారు. రాజుల కాలంలో, బ్రిటిష్ వారి పాలన కాలంలో అనంతగిరి, సంస్థానంలో బూర్జ గ్రామం ఉండేదని, బూర్జ పంచాయతీకి సమీపంలో 15 కిలోమీటర్ల దూరంలో అరకులోయ మండల కేంద్రం కలిగి ఉందని, అరకులోయ మండలంలో బూర్జ గ్రామపంచాయతీ విలీనం చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నబాబు,భాస్కర్ రావు, మోహన్ రావు,రామమూర్తి,సోమర, రామకృష్ణ, హరిమూర్తి, నినిమజ్జి, వెంకటస్వామి,రవిశంకర్, జాన్ బాబు, భీమరాజు, తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ వంపూరు గంగులయ్యకు జనసేన శ్రేణుల సన్మానం

**జనసేన పార్టీ పాడేరు నియోజకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా సత్కార కార్యక్రమం**



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు /గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఆగస్టు 13 :**అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాడేరు నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్యను పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు.కూటమి ప్రభుత్వం ఆయన్ను రాష్ట్ర జానపద కళలు మరియు సృజనాత్మకత అకాడమీ చైర్మనుగా నియమించిన సందర్భంగా ఈ సత్కారం జరిగింది.ఈ సందర్భంగా గంగులయ్య మాట్లాడుతూ, "మా గిరిజన ప్రాంతాల్లో మరుగున పడిన అనేక జానపద కథలు, నాటకాలు, సాహిత్యం, గీతాలు ఉన్నాయి. వాటిని పునఃప్రచారంలోకి తీసుకురావడానికి అకాడమీ వేదికగా నిర్విరామ కృషి చేస్తాం," అని తెలిపారు. సన్మాన కార్యక్రమంలో ఆయన్ను పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేయడం ద్వారా ఆనందాన్ని పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం, జీకే వీధి మండల ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్, నాదోలి మురళికృష్ణ, మండల అధ్యక్షుడు భూపాల్, ఉపాధ్యక్షుడు తల్లే త్రిమూర్తులు,పిఏసిఎస్ చైర్మన్ కిముడు కృష్ణమూర్తి, మార్కెట్ డైరెక్టర్ ఉగ్రంగి లక్ష్మణ్, సీనియర్ నాయకులు చిన్ని, రాజుబాబు, ప్రధాన కార్యదర్శి సాయి, మాజీ పిఏసిఎస్ చైర్మన్ వసుపరీ ప్రసాద్ పెదవలస పంచాయితీ జనసేన అధ్యక్షుడు విరోజి త్రిమూర్తులు, సోషల్ మీడియా కొయ్యం, ఇమ్మానుయేల్ (సిద్ధు), గుండ్ల రఘువంశీ, మాచర్ల అనిల్, కొర్రా రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.పాడేరు నియోజకవర్గ జనసేన శ్రేణుల మధ్య ఈ కార్యక్రమం ఉత్సాహంగా, ఆనందంగా సాగింది.

# మట్టి వినాయక విగ్రహాలనే వినియోగించాలి

- గణేష్ ఉత్సవాల నిర్వహణ సమయంలో పరిశుభ్రత, పారిశుద్ధ్యం తప్పనిసరి
- వినాయక చవితి ఉత్సవాల అనుమతులకు సింగిల్ విండో క్లియరెన్స్ సెల్ ఏర్పాటు
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 13 :** ఆగస్టు 27న జరగబోయే వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు జీవీఎంసీ లో సింగిల్ విండో క్లియరెన్స్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం పత్రికా ప్రకటన ద్వారా నగర ప్రజలకు తెలియజేశారు. జీవీఎంసీ పరిధిలో ఆగస్టు 27న నిర్వహించే వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ప్రజలు, నివాసిత సంక్షేమ సంఘాలు, ఎన్జీవోస్, స్వచ్ఛంద సంస్థలు, ఉత్సవ నిర్వాహణ కమిటీలు గణేష్ ఉత్సవాలు నిర్వహించేందుకు అనుమతులు మంజూరుకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయం లోనూ, జోనల్ కార్యాలయంలోనూ సింగిల్ విండో క్లియరెన్స్ సెల్ ను ఏర్పాటు చేయడం జరిగిందని కమిషనర్ తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నోడల్ అధికారులు జివిఎంసి ప్రధాన వైద్యాధికారి ఈ.ఎన్.వి.నరేష్ కుమార్ ఫోన్ నెంబర్ 9848308823, సిటీ ప్లానర్ వి.మీనా కుమారి ఫోన్ నెంబర్ 83749966777, కార్యనిర్వాహక ఇంజనీరు (ఎలక్ట్రికల్ విభాగం) డి.శ్రీధర్ ఫోన్ నెంబర్ 8187898427, అగ్నిమాపక అధికారి బి.కృపావరం ఫోన్ నెంబర్ 9912448555 అలాగే జోనల్ స్థాయిలో ఆయా జోనల్ లోని జోనల్ కమిషనర్లు, సహాయ వైద్యాధికార్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, కార్యనిర్వాక ఇంజనీర్లను సంప్రదించాలని కమిషనర్ తెలిపారు. నగర ప్రజలు, నివాసిత సంక్షేమ సంఘ సభ్యులు, ఎన్జీవోస్, స్వచ్ఛంద సంస్థలు, ఉత్సవ నిర్వాహక కమిటీల ప్రతినిధులు పర్యా వరణానికి హాని కలగకుండా మట్టి వినాయక విగ్రహాలనే వినియోగించాలని ఎటువంటి రసాయనాలు, రంగులుతో కూడిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ధర్మాకోల్ తో తయారు చేసిన విగ్రహాలు వినియోగించరాదని కమిషనర్ తెలిపారు. ప్రజలు ఇంటి వద్ద జరుపుకునే మట్టి వినాయక విగ్రహాలను ఒక తొట్టె లో నీరు పోసి నిమజ్జనం చేయాలని, కాలనీవాసులు వారి కాలనీలో పార్కుల వద్ద ఏర్పాటుచేసిన నీటి ట్యాంకులలో నిమజ్జనం చేపట్టాలని తెలిపారు. ప్రజలు పబ్లిక్ ప్రదేశాలలో వినోదపు స్టేజ్ లు ఏర్పాటు చేయడా నికి ముందుగా నోడల్ అధికారుల నుండి నిబం ధనలతో కూడిన అనుమతులు తీసుకోవాలని తెలిపారు. గణేష్ ఉత్సవాల నిర్వహణ సమ యంలో పరిశుభ్రత, పారిశుద్ధ్యం తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ ప్రజలకు సూచించారు.

# 75 వార్డులు సుపరిపాలన తొలి అడుగు ముగింపు కార్యక్రమం





**గాజువాక పెన్ పవర్, ఆగస్టు 13:**కూటమి ఏడాది పాలనపై ప్రజలు సంతృప్తితోపాటు, సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం వలన, గ్రామస్థాయి ప్రజా సమస్యలు ప్రభుత్వంపై వారి స్పందన తెలిసిందని 75వ వార్డు కూటమి నాయకులు అభిప్రాయపడ్డారు.

75 వార్డులో చేపట్టిన సుపరిపాలన తొలిఅడుగు ముగింపు కార్యక్రమం జరిగినది.

ఈ కార్యక్రమం 75వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు నమ్మి అప్పారావు, ములకలపల్లి పెంటయ్య ఆధ్వర్యంలో జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన నాయకులు కోన చిన అప్పరావు పాల్గొని, మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం రాకముందు, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుపరిస్తూ, ప్రజా సంక్షేమం మరియు రాష్ట్ర అభివృద్ధి సమతుల్యంగా పాటిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ , బిజెపి కేంద్ర ప్రభుత్వం సహకారాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పరుస్తున్నారని తెలిపారు. ముఖ్యఅతిథి బిజెపి వార్డు అధ్యక్షురాలు కుంకి వరలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర సహకారంతో రాష్ట్రానికి కావలసిన నిధులను సమకూరుస్తూ, స్టీల్ ప్లాంట్ గాని నూతన పరిశ్రమలకు అవకాశం కల్పిస్తూ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో రాష్ట్ర నాయకత్వం సమర్థంగా పనిచేస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమాని విజయవంతంలో క్లస్టర్ ఇంచార్జి ఉరుకూటి అప్పలరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆదేశాలు జారీచేసిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం 75 వ వార్డులో 100% పూర్తి చేసినందుకు చాలా ఆనందంగా ఉందని, దీనికి సహకరించిన యూనిట్, బూత్ ఇంచార్జిలు, తెలుగుదేశం పార్టీ నాయకులందరికీ ధన్యవాదాలు తెలుపుతూ కార్యక్రమం జరిగిన రోజుల్లో ప్రతి ఏరియాలో కూడా మంచి స్పందన బాగుందని, ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి తన అభిప్రాయాలను ప్రభుత్వ పాలన పట్ల సంతృప్తిని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా తెలుగుయువత ప్రధానకార్యదర్శి మొల్లి పెంటిరాజు , ఎం ఆర్ పి ఎస్ నాయకుడు అంజూర దీపక్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఉరుకూటి అప్పారావు, బొంగు రాజు, వంగలపూడి అప్పల రాజు,మొల్లి అప్పలనాయుడు, కనితి సన్యాసమ్మ ,పెద్దాడ సరోజిని, నమ్మి పుష్పలత, మొల్లి సన్ని ,చట్టి సన్నీ, అప్పల సతీష్, సీరపు వెంకటరావు, నామాల అర్జున్, మొల్లి మారి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 3వ జోన్ లో బహిరంగ వేలం ప్రకటన

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 13 :**

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ 3వ జోన్ (ఆశీలు మెట్ట) పరిధిలోని పలు దుకాణాలకు ఆగస్టు 21న ఉదయం 11 గంటలకు బహిరంగ బలం నిర్వహించబడునని 3వ జోనల్ కమిషన ర్ కె.శివప్రసాద్ బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. 3వ జోన్ పరిధిలో ఖాళీ గా ఉన్న పలు దుకాణాలకు తేది: 21-08-2025 (గురువారం) న జీవీఎంసీ జోన్-3 ఆశీలు మెట్ట కార్యాలయంలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించబడునని, ఆసక్తి గల పాటదారులు పూర్తి వివరాలకు 3వ జోనల్ కమిషనర్ కార్యాలయం లోని పని వేళలో పర్యవేక్షకులను సంప్రదించగలరని జోనల్ కమిషనర్ తెలియజేశారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి - బిజెపి





**గాజువాక పెన్ పవర్, ఆగస్టు 13**

బిజెపి రాష్ట్ర మహిళా మోర్చ కార్యవర్గ సభ్యురాలు జిలకర్ర భువనేశ్వరి మండల ప్రధాన కార్యదర్శి జిలకర్ర రమణ ఆధ్వర్యంలో ఉక్కునగరం మండలం 76వ వార్డు బాలచెరువు శివాలయం నుండి పోలీస్ స్టేషన్ కూడలి వరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు.ముఖ్య అతిధిగా జిల్లా ప్రధాన కార్యదర్శి సిరసపల్లి నూకరాజు, గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం మాజీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ పెద్దల పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా యాత్ర ర్యాలీ కార్యక్రమం నియోజకవర్గంలో అన్ని మండలాల్లో విజయవంతం జరుగుతుందని తెలిపారు. ప్రతి భారతీయుడు తన ఇంటి పై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఆ యొక్క పోటో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని కోరారు. తద్వారా మన ఐక్యత ప్రపంచానికి చాటి చెప్పాలని అన్నారు. భారత్ మాతా కీ జై అంటూ నినాదాలు చేశారు. కూడలిలో మానవ హారం ప్రదర్శించారు. కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు ,జిల్లా నాయకులు నాగేశ్వరరావు, మండల నాయకులు సియ్యాద్రి అప్పలరాజు,ఉమామహేశ్వరరావు,సోమశేఖర్ , సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.





# నడిరోడ్డుపై మహిళా ఉద్యోగిని అడ్డుకొని దాడి.. చీర చింపేశారు

**హైదరాబాద్ పెన్ పవర్:** పట్టపగలు.. నడి రోడ్డు మీద ఒక మహిళా ప్రభుత్వ ఉద్యోగి మీద పలువురు ఒక గుంపుగా వచ్చి అడ్డుకోవటం.. ఆమెతో వాదనకు దిగటం.. ఆ పై దాడి చేయటం.. పిడిగుద్దులు గుద్దుతూ.. జుట్టు పట్టి లాగటమే కాదు.. చీర చించేసిన అరాచకం చోటు చేసుకుంది. ఇదంతా చదివిన తర్వాత ఇదెక్కడో జరిగిందని భావిస్తే తప్పులో కాలేసినట్లే. ఏపీలోని అన్నమయ్య జిల్లాలో చోటు చేసుకున్న ఈ దారుణం ఇప్పుడు షాకింగ్ గా మారింది.ఇంతకూ సదరు మహిళా ప్రభుత్వ ఉద్యోగి చేసిన తప్పేంటో తెలుసా? బాధ్యతగా రిపోర్టును పంపటమే. ఉన్నతాధికారుల ఆదేశాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో విచారణ జరిపి.. వాస్తవాలతో రిపోర్టు ఇవ్వటమే ఆమె చేసిన పాపం. దీంతో కన్నెర్ర చేసి.. ఆమెను నడి రోడ్డు మీద చిత్రహింసలు పెట్టిన వైనం విమర్శలకు తావిస్తోంది. అసలేం జరిగిందంటే..అన్నమయ్య జిల్లా గుర్రంకొండ -3 మహిళా సమాఖ్యకు సంఘమిత్రగా.. అదే ప్రాంతంలో ఆశా కార్యకర్తగా నాగరాజమ్మ పదిహేనేళ్లుగా పని చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆమె రెండు ఉద్యోగాలు చేస్తూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్ని మోసం చేస్తున్న వైనంపై జిల్లా కలెక్టర్ కు కొందరు కంప్లైంట్ చేశారు. దీంతో.. ఈ అంశంపై నివేదిక పంపాలని గుర్రంకొండ ఏపీఎం రజినికి ఆదేశాలు జారీ చేశారు.దీంతో ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాల్ని సేకరించారు. చివరకు నాగరాజమ్మ రెండు ఉద్యోగాల్ని చేస్తున్నది వాస్తవమేనని తేల్చారు. పీహెచ్ సీ వైద్యులు సైతం ఇదే అంశంపై రిపోర్టు ఇచ్చారు. దీంతో



ఏపీఎం రజనిపై నాగరాజమ్మ, ఆమె మద్దతుదారులు కక్ష కట్టారు. తలారివాండ్లపల్లె.. మజ్జిగవారి పల్లెలకు చెందిన కొందరు వైసీపీ నేతలు.. మహిళలు నాగరాజమ్మ ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య ఆఫీసుకు వచ్చారు. ఏపీఎంను అక్కడకు రావాలని కోరారు. విధి నిర్వహణలో భాగంగా ఎంపీడీవో ఆఫీసుకు వచ్చిన రజినిని రోడ్డు మీదనే అడ్డుకున్నారు.

ఆమెతో మాట్లాడుతూ ఉండగా.. పలువురు మహిళలు ఆమెపై పిడిగుద్దులు గుద్దుతూ.. చీర చించేశారు. జుట్టు పట్టుకొని లాగుతూ ఇష్టారాజ్యంగా దాడికి పాల్పడ్డారు.బూతులు తిడుతూ.. విక్రతంగా వ్యవహరిస్తూ ఆమెను చిత్రహింసలకు గురి చేశారు. ఈ దారుణాన్ని చూసిన స్థానికులు పలువురు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే.. వారు ఘటనా స్థలానికి చేరుకునేసరికి పోలీసులు పారిపోయారు. ఈ అంశంపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. చేతిలో అధికారంలో లేని వేళలో వైసీపీ నేతలు మహిళా ఉద్యోగి పట్ల వ్యవహరించిన వైనం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# రాహుల్ గాంధీకి టచ్ లో చంద్రబాబు...నిజమేనా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** జాతీయ రాజకీయాల్లో చాలా చోటు చేసుకుంటున్నాయి. బీజేపీ నాయకత్వంలో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం పాలన సాగిస్తోంది. మోడీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ అండ్ కో ఇండియా కూటమిగా స్ట్రాంగ్ అపోజిషన్ గా ఉన్నారు. 2024 ఎన్నికల తరువాత వచ్చిన మార్పు ఏమిటి అంటే లీడర్ ఆఫ్ అపోజిషన్ హోదాలో రాహుల్ ఉన్నారు. గతం కంటే ఎక్కువగా ఇండియా కూటమి సీట్లు పెరిగాయి. అదే సమయంలో బీజేపీకి సొంతంగా బలం లేదు, సింపుల్ మెజారిటీకి చాలా దూరంలో ఆ పార్టీ ఉంది. మిత్రుల సాయంతో కేంద్ర ప్రభుత్వం నడుస్తోంది. గట్టిగా పదునాలుగు నెలలు కాలేదు కానీ మోడీ ప్రభుత్వాన్ని రాహుల్ అండ్ కో దూకుడుగానే సవాల్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ స్థాయిలో ఎపుడు ఏమి జరుగుతుందో అన్న చర్చ అయితే ఉంది.

**బాంబు పేల్చిన జగన్ :**

జాతీయ రాజకీయాలలో చూస్తే ఎన్డీయే కూటమి ఇండియా కూటమి రెండే ఉన్నాయి. ఈ రెండింటిలోనే దేశంలోని నూటికి తొంబై శాతం పార్టీలు చేరిపోయాయి. పది శాతం పార్టీలు మాత్రం తటస్థంగా ఉన్నాయి. అయితే ఏపీ నుంచి చూస్తే టీడీపీ ఎన్డీయే కూటమిలో ఉంది. మోడీ ఈజ్ గ్రేట్ అని రోజుకు ఒకసారి అయినా చాలా గట్టిగా చంద్రబాబు చెబుతున్నారు. బీజేపీతో పొత్తు కోసం టీడీపీ ఎంత తీవ్రంగా ప్రయత్నం చేసి 2024 ఎన్నికల్లో జత కలిసిందో అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీతో చంద్రబాబు టచ్ లో ఉన్నారు అని వైసీపీ అధినేత జగన్ బాంబు పేల్చారు.

**ఆయన ద్వారానట :**

తెలంగాణా లో కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి ద్వారా చంద్రబాబు రాహుల్ గాంధీకి టచ్ లో ఉన్నారు అని జగన్ ఆరోపించారు. ఇక రేవంత్ రెడ్డి గతంలో టీడీపీలో ఎంత కీలకంగా ఉండేవారో తెలిసిందే. ఆయన చంద్రబాబుకు అత్యంత సన్నిహితంగా మెలిగిన వారుగా ఉన్నారు. ఇక రేవంత్ రెడ్డితో ఈ రోజుకీ చంద్రబాబుకు మంచి సంబంధాలే ఉన్నాయని బీఆర్ ఎస్ నాయకులు ఆరోపిస్తూ ఉంటారు. ఇక ఏపీలో చూస్తే జగన్ కూడా అదే నమ్ముతారు. ఇపుడు ఆయన దీనికి మరికాస్త పెంచి బాబు రాహుల్ గాంధీకి టచ్ లో ఉంటున్నది నిజం అంటున్నారు. రేవంత్ రెడ్డి ద్వారా ఇదంతా జరుగుతోంది అని చెబుతున్నారు.

**కొత్త విషయం అయితే కాదుగా :**

అయితే తెలుగుదేశం కాంగ్రెస్ కలవడం అన్నది కొత్త విషయం ఏమీ కాదని అంతా అంటారు. 2018లో తెలంగాణాలో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం కాంగ్రెస్ కలిసి పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాలేదు. కాంగ్రెస్ లో ఉన్న రేవంత్ రెడ్డి ద్వారానే ఈ పొత్తు సాధ్యపడింది అంటారు. ఇక దీనికంటే ముందు బెంగళూరులో కాంగ్రెస్ మిత్రుల ప్రభుత్వం ఏర్పాటు కోసం కాంగ్రెస్ దాని సన్నిహిత పార్టీలతో కలసి బాబు కనిపించారు. ఆ తరువాత తెలంగాణాలో కూడా పొత్తు ఖరారు అయింది. అందువల్ల రాజకీయంగా ఏమైనా జరగవచ్చు అన్న వారూ ఉన్నారు.

**జగన్ సూటి ప్రశ్న :**

ఏపీలో ఓట్ల చోరీ మీద రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడరు అని జగన్ సూటిగా ప్రశ్నించారు. ఎందుకు మాట్లాడరు అంటే చంద్రబాబుతో హాట్ లైన్ లో టచ్ లో ఉన్నారు కాబట్టి అని ఆయన అసలు విషయం ఇదే అంటున్నారు. ఇక ఏపీలో 2024 ఎన్నికలలో పోలింగ్ ముగిసేనాటికి కౌంటింగ్ నాటికి 12.5 పెరిగాయి. అంటే 48 లక్షల ఓట్లు ఒకేసారి పెరిగాయని ఆయన చెప్పారు. మరి ఇంత పెద్ద ఎత్తున ఓట్ల చోరీ ఏపీలో జరిగితే రాహుల్ గాంధీ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. అంతే కాదు ఏపీ కాంగ్రెస్ ఇంచార్జి మాణికం ఠాగూర్ కూడా ఏపీ వ్యవహారాల మీద నోరెత్తరని అమరావతిలో జరుగుతున్న అవినీతి మీద కూడా మౌనంగా ఉంటారని జగన్ విమర్శించారు. మొత్తం మీద చంద్రబాబు రాహుల్ మధ్య కొత్తగా మరోసారి బంధం పెనవేసుకుంటోంది అని జగన్ చెప్పిన వార్త జాతీయ రాజకీయాల్లో అతి పెద్ద చర్చకు దారి తీసే అవకాశం ఉంది. అంతే కాదు బీజేపీ శిబిరం లో కూడా వేడి పుట్టించే చాన్స్ ఉంది అని అంటున్నారు.

# పిస్తా హౌస్.. కిచెన్ ఇంత అరాచకమా?

**హైదరాబాద్ పెన్ పవర్:** కొన్నేళ్ల క్రితం పాతబస్తీలో ఏర్పాటు చేసిన పిస్తా హౌస్ కు తక్కువ వ్యవధిలోనే ఎంతటి పేరు ప్రఖ్యాతుల్ని సొంతం చేసుకుందో తెలిసిందే. కొవిడ్ తర్వాత పిస్తా హౌస్ లను భారీ ఎత్తున ఫ్రాంఛైజీల పేరుతో కేటాయిస్తున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్ మహానగరంతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. విదేశాల్లోనూ దీని బ్రాంచ్ లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేకించి రంజాన్ మాసంలో వండి వడ్డించే హలీమ్ కు ఉండే క్రేజ్ అంతా ఇంతా కాదు. దీని కోసం పిస్తా హౌస్ ముందు బారులు తీరి ఉండటం తెలిసిందే.

ఇదంతా ఒక ఎత్తు.. తాజాగా పిస్తా హౌస్ కు చెందిన షాకింగ్ నిజాలు వెలుగు చూశాయి. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు మంగళవారం హైదరాబాద్ నగర వ్యాప్తంగా ఉన్న రెండు డజన్లకు పైనే ఉన్న పిస్తా హౌస్ లను కాస్త తేడాతో ఒకే కాలంలో తనిఖీలు చేపట్టారు. మొత్తం పాతిక రెస్టారెంట్లను తనిఖీ చేసిన అధికారులు 23 శాఖల్లో నమూనాలు సేకరించారు.

వీటికి సంబంధించిన వివరాల్ని అధికారిక ప్రకటన రూపంలో విడుదల చేశారు. ఆ పిస్తా హౌస్.. ఈ పిస్తా హౌస్ అన్న తేడా లేకుండా అత్యధికంగా ఉన్న పిస్తా హౌస్ లలో కామన్ గా కొన్ని అరాచకాల్ని అధికారులు గుర్తించారు. అందులో కీలకం..



**కిచెన్ శుభ్రంగా లేకపోవటం**

**ఫ్రిజ్ ల నిర్వహణ దారుణంగా ఉండటం**

**చిమ్నీలు మురికిగా ఉండటం**

**వంట గదులకు జాలీల ఏర్పాటు లేకపోవటం**

**ఫుడ్ సేఫ్టీ నిబంధనల్ని పట్టించుకోవటం**

**వంట గదిలో ఎలుకలు.. బొద్దింకల గుర్తింపు**

**నాన్ వెజ్ వంటకాల్లో సింథటిక్ ఫుడ్ కలర్స్ వినియోగం**

**తుప్పు పట్టిన ఫ్రిజ్ లో నాన్ వెజ్ ను నిల్వ ఉంచటం**

**తుప్పు పట్టిన కత్తులతో కూరగాయల్ని కట్ చేయటం**

ఇలా పెద్ద ఎత్తున నిబంధనల ఉల్లంఘన జరుగుతున్న విషయాన్ని గుర్తించారు. ఒక పెద్ద బ్రాండ్ గా పిస్తా హౌస్ ఎదుగుతున్న వేళలో.. ఈ తరహాలో వంట గది.. అందులోని వస్తువుల నిర్వహణ ఉండటం విస్మయానికి గురి చేస్తోంది. భారీ ఎత్తున రెస్టారెంట్లను ఏర్పాటు చేసే సంస్థలు.. నాణ్యత.. ప్రజల ఆరోగ్యం లాంటి అంశాల్లోనూ మరింత అప్రమత్తంగా ఉండటం చాలా అవసరం. అధికారుల తనిఖీల్లో వెల్లడైన అంశాలు షాకింగ్ గా మారాయి. ఇప్పటికైనా పిస్తా హౌస్ సంస్థలు కళ్లు తెరిచి.. తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# కుక్కలు పోతే కోతులు.. ప్యారిస్ అనుభవం చెప్పిన మేనక



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశ రాజధాని ఢిల్లీలో వీధి కుక్కలు కనిపించకూడదు అంటూ సుప్రీంకోర్టు ఆదేశించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీతోపాటు ఆయన సోదరి, ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా, కేంద్ర మాజీ మంత్రి మేనకా గాంధీ నిరసన తెలిపారు. అదేవిధంగా పలువురు సినీ ప్రముఖులు సైతం సుప్రీం ఆదేశాలతో జీవ వైవిధ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కుక్కలను సామూహికంగా తరలించడాన్ని కేంద్ర మాజీ మంత్రి, జంతు హక్కుల ఉద్యమకారిణి మేనకా గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు. 'ఇది అసాధ్యం, వేల కోట్ల ఖర్చు. పర్యావరణానికి ముప్పు' అంటూ ఆమె హెచ్చరించారు. అంతేకాకుండా తన అధ్యయనంలో తెలిసిన ఓ ఆసక్తికర అంశాన్ని ఆమె పంచుకున్నారు. 1880లో ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్ లో కుక్కలు పెరిగిపోయాయని సామూహికంగా చంపేశారని, దానివల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతిని ఎలుకలు పెరిగిపోయాయి. దానివల్ల ఊహించని పరిణామాలు ఎదురయ్యాయని మేనకా గాంధీ వివరించారు. ఇప్పుడు ఢిల్లీలో కుక్కలను లేకుండా చేస్తామంటే కోతుల సంఖ్య ఎక్కువయ్యే ప్రమాదం ఉందన్నారు. అదే జరిగితే ఏం చేస్తారంటూ ఆమె ప్రశ్నించారు. ఇక రాహుల్ గాంధీ సైతం సుప్రీం ఆదేశాలపై విస్మయం వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాలు సైన్సు, మానవత్వం లేని కొన్ని దశాబ్దాల కిందటి ప్రాచీన యుగంలోకి వెళ్లినట్టున్నాయని వ్యాఖ్యానించారు. మన దయ, కరుణలను దూరం చేయడమే అన్నారు. టీకాలు వేయడం, స్థానికంగా అవాసాలు ఏర్పాటుచేయడం వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేయాలని సూచించారు. ఎంపీ ప్రియాంక సైతం స్పందిస్తూ కుక్కలు ఎంతో అందమైనవి, వాటి పట్ల క్రూరత్వం ప్రదర్శించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. మరోవైపు సుప్రీం ఆదేశాలపై బాలివుడ్ నటీనటులు కూడా స్పందించారు. జాన్వీకపూర్, వరుణ ధవన్, సింగర్ చిన్మయి శ్రీపాద, నిర్మాత సిద్ధార్థ్ ఆనంద్ స్పందిస్తూ కుక్కలకు ఇది మరణ శాసనమే అని వ్యాఖ్యానించారు. మూగజీవాలపై కనికరం చూపలేమా? అంటూ ప్రశ్నించారు. ఇక తెలుగు నటుడు అడవి శేష్ కూడా సుప్రీం తీర్పుపై తన అభిప్రాయం వ్యక్తం చేశారు. భారతీయ కరుణా, మానవీయ సూత్రాలకు ఈ ఆదేశాలు విరుద్ధం అంటూ అడవి శేష్ వ్యాఖ్యానించారు. వరుణ్ గ్రోవర్, వీరదాస్ వంటి నటులు కూడా సుప్రీం ఆదేశాలను తప్పుబట్టారు. మరోవైపు ఢిల్లీలో వీధి కుక్కలు కనిపించకూడదనే ఆదేశాలపై సుప్రీంకోర్టు వెనక్కి తగ్గేదేలేదని మంగళవారం కూడా స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆవరణలో శునకాలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయని చెబుతూ కోర్టు ఆవరణలో ఒక్క కుక్క కూడా కనిపించకూడదని తాజాగా ఆదేశించింది. కోర్టుకు వచ్చేవారు తినగా మిగిలిపోయిన పదార్థాలను కుక్కలు వేయడం వల్ల వాటికి ఆహారం లభిస్తుందని, ఇకపై ఎవరూ అలా చేయొద్దని ఆదేశించింది. మిగిలిపోయిన పదార్థాలను ధ్వంసం చేయాలని లేదా ప్యాక్ చేసి గట్టి మూతలు ఉన్న డస్ట్ బిన్లలో వేయాలని సర్క్యూలర్ జారీ చేసింది కోర్టు.

# సడన్ ఛేంజ్.. ఒకేసారి టీడీపీ కార్యాలయానికి చంద్రబాబు, లోకేశ్!



**హైదరాబాద్ పెన్ పవర్:** టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు, యువ నేత, మంత్రి లోకేష్ లో అనూహ్య మార్పు వచ్చింది. గత ఏడాది జూన్ లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు క్రమంగా ప్రభుత్వ అధికార కార్యక్రమాల్లో బిజీ అయిపోయారు. మంత్రి నారా లోకేష్ సైతం ఎక్కువగా ప్రభుత్వ కార్యక్రమాలపైనే ఫోకస్ చేస్తున్నారు. దీంతో అధిష్టానం తమను పట్టించుకోవడం లేదని టీడీపీ కేడరులో అసమ్మతి అసంతృప్తి పెరిగిపోతోంది. ఈ విషయంపై అధినేతకు పలు మార్గాల నుంచి సమాచారం వచ్చింది. దీంతో ఆయన మంగళవారం ఆకస్మికంగా పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తో చర్చించారు. అంతేకాకుండా బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో సమగ్ర సమీక్షకు నిర్ణయించారు. దీనికి మంత్రి లోకేశ్ కూడా హాజరుకావాలని నిర్ణయించడం ఆసక్తికరంగా మారింది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన టీడీపీ.. 14 నెలలుగా అనేక కార్యక్రమాలు చేస్తోంది. వరుసగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అయితే ఈ కార్యక్రమాలపై పెద్దగా ప్రచారం జరగడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదికలు వచ్చాయని అంటున్నారు. దీనికి కారణం కార్యకర్తల్లో నిస్తేజం అలుముకోవడమే అంటున్నారు. పార్టీ అధికారంలో ఉన్నా తమకు ప్రోత్సాహం కరువు అవుతూందని టీడీపీ కేడరు ఆవేదన వ్యక్తం చేస్తోంది. ప్రధానంగా నియోజకవర్గ, జిల్లా స్థాయిలో నామినేడెట్ పదవులు భర్తీ కాకపోవడం ఈ అసంతృప్తికి కారణంగా విశ్లేషిస్తున్నారు.

రాష్ట్రస్థాయిలో పలు నామినేటెడ్ పదవులను భర్తీ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు క్షేత్రస్థాయిలో ఎక్కువ ప్రభావం చూపే నియోజకవర్గ స్థాయి పదవుల భర్తీలో జాప్యం చేస్తున్నారని కార్యకర్తలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. అయితే దీనికి ఎమ్మెల్యేలే కారణమని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. చాలా మంది ఎమ్మెల్యేలు నామినేటెడ్ పదవుల భర్తీకి పేర్లు ఇవ్వడం లేదని చెబుతున్నారు. అంతేకాకుండా మహనాడు ముగిసి మూడు నెలలు అవుతున్నా, పార్టీ పదవులను భర్తీ చేయలేదు. మహానాడు సమయంలో మంత్రి లోకేశ్ ను పార్టీ వర్కింగు ప్రెసిడెంటుగా నియమిస్తారని ప్రచారం జరిగింది. ఆ ప్రక్రియ కూడా ముందుకు కదలలేదు. దీనికి నియోజకవర్గ స్థాయిలో జరగాల్సిన క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయి నియామకాల నుంచి పార్లమెంటు స్థాయి వరకు ఎన్నికల ప్రక్రియ పూర్తి కాకపోవడం ఓ కారణంగా చెబుతున్నారు.చంద్రబాబు అధికార కార్యక్రమాల్లో తీరిక లేకుండా గడుపుతుండటం, ఆయనకు తోడుగా లోకేశ్ కూడా బిజీ అయిపోవడం వల్ల తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని కార్యకర్తలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పార్టీ పెద్దలు అధిష్టానాన్ని అప్రమత్తం చేయడంతో పార్టీపై దృష్టి పెట్టాలని సీఎం నిర్ణయించినట్లు సమాచారం. అందుకే హడావుడిగా పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. కాగా, కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు నిర్వహించే సమీక్షలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారనే ఉత్కంఠ కనిపిస్తోంది.

# వీధి కుక్కలపై సెలబ్రెటీల పోస్టులు.. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ స్పందన



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో వీధి కుక్కల సమస్య చాలా కాలంగా చర్చనీయాంశంగా ఉంది. దీనిపై ప్రజల భద్రత, జంతు హక్కుల మధ్య తీవ్రమైన వైరుధ్యం ఎప్పుడూ ఉంటుంది. ఇటీవల ఈ సమస్యపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఒక తీర్పు దేశవ్యాప్తంగా పెద్ద దుమారాన్ని సృష్టించింది. ఈ తీర్పుపై వచ్చిన వ్యతిరేకత, దాని తర్వాత పరిణామాలను విశ్లేషిద్దాం.

**సుప్రీంకోర్టు తీర్పు సారాంశం**

జస్టిస్ జేబీ పార్డివాలా, ఆర్. మహదేవన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం దేశ రాజధాని ఢిల్లీలో వీధి కుక్కలను పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. ఈ ప్రక్రియను 8 వారాల్లోగా పూర్తి చేయాలని ఎవరైనా అడ్డుకుంటే కఠిన చర్యలు తీసుకోవాలని కోర్టు స్పష్టం చేసింది. ఈ నిర్ణయానికి ప్రధాన కారణాలుగా పిల్లల ప్రాణ భద్రత, రేబిస్ వ్యాప్తి నివారణను కోర్టు పేర్కొంది. ఈ తీర్పుతో చాలా మంది ప్రజలు ఊరట చెందగా జంతు ప్రేమికులలో ఆందోళన మొదలైంది.

**తీర్పుపై తీవ్ర వ్యతిరేకత**

సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. జంతు ప్రేమికులు, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు ఈ తీర్పును తీవ్రంగా వ్యతిరేకించారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, బీజేపీ సీనియర్ నేత, జంతు హక్కుల కార్యకర్త మేనకా గాంధీ ఈ తీర్పును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ తీర్పు అమానవీయమని, వీధి కుక్కలను తొలగించడం సమస్యకు పరిష్కారం కాదని వారు పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా "జస్టిస్ ఫర్ డాగ్స్" వంటి హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండింగ్‌లోకి వచ్చాయి. వేలమంది ప్రజలు తీర్పుకు వ్యతిరేకంగా తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద పౌర సంఘాలు.. జంతు హక్కుల కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ నిరసనలన్నీ సుప్రీంకోర్టు తీర్పులోని కఠినమైన అంశాలపై దృష్టి సారించాయి. వీధి కుక్కలను చంపేయడం అనేది ఒక క్రూరమైన చర్య అని, వాటిని క్రమబద్ధీకరించడం , టీకాలు వేయడం వంటి ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని వ్యతిరేక వర్గం వాదించింది.

**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి హామీ**

దేశవ్యాప్త వ్యతిరేకత.. నిరసనల నేపథ్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్. గవాయ్ ఒక కీలకమైన ప్రకటన చేశారు. ఈ విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే తీర్పును పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమస్యను లోతుగా అధ్యయనం చేసి, తగిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రకటన జంతు ప్రేమికులకు మరియు కార్యకర్తలకు ఒక పెద్ద ఊరటనిచ్చింది.

**ఇతర రాష్ట్రాల స్పందన**

సుప్రీంకోర్టు తీర్పు ప్రభావం ఇతర రాష్ట్రాలపై కూడా పడింది. ఉదాహరణకు రాజస్థాన్ హైకోర్టు కూడా ఇదే తరహాలో స్పందించింది. ప్రజల భద్రత కోసం తమ రాష్ట్రంలో కూడా తక్షణమే వీధి కుక్కలను తొలగించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇది దేశవ్యాప్తంగా వీధి కుక్కల సమస్యపై ఒక కొత్త చర్చకు దారితీసింది.

**భవిష్యత్తులో ఏం జరగవచ్చు?**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇచ్చిన హామీతో ఈ తీర్పులో మార్పులు జరిగే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో కోర్టు కింది అంశాలను పరిగణనలోకి తీసుకోవచ్చు. వీధి కుక్కలను తొలగించకుండా వాటిని క్రమబద్ధీకరించడం, టీకాలు వేయడం వంటి మార్గాలను ప్రోత్సహించడం ముఖ్యం. ప్రజల భద్రత , జంతు హక్కుల మధ్య సమతుల్యం సాధించే ఒక కొత్త విధానాన్ని రూపొందించడం అవసరం. స్థానిక సంస్థలు (మున్సిపాలిటీలు) ఈ సమస్యను పరిష్కరించడంలో తమ బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వర్తించేలా మార్గదర్శకాలు ఇవ్వడం ముఖ్యం.

వీధి కుక్కల సమస్య ఒక క్లిష్టమైన సమస్య. ఇది కేవలం ఒక పట్టణ సమస్య కాదు, ఒక సామాజిక మరియు నైతిక సమస్య కూడా. ప్రజల భద్రతను కాపాడటంతో పాటు, జంతువుల పట్ల కనికరం చూపడం కూడా చాలా ముఖ్యం. రాబోయే రోజుల్లో సుప్రీంకోర్టు తీసుకునే నిర్ణయం ఈ రెండు అంశాలను ఎలా సమతుల్యం చేస్తుందో వేచి చూడాలి.

# ధోని ఫ్రెండ్ కు బిగుస్తున్న ఈడీ ఉచ్చు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆన్‌లైన్ అక్రమ బెట్టింగ్ యాప్‌లపై దేశవ్యాప్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తన దర్యాప్తును వేగవంతం చేసింది. ఇప్పటికే పలువురు సినీ, క్రీడా ప్రముఖులను విచారించిన ఈడీ, తాజాగా భారత మాజీ క్రికెటర్ 'మిస్టర్ ఐపీఎల్' సురేష్ రైనాకు సమన్లు జారీ చేయడంతో ఈ కేసు మరో కీలక మలుపు తిరిగింది. రైనా 1xBet అనే బెట్టింగ్ యాప్‌కు ప్రచారకర్తగా వ్యవహరించాడనే ఆరోపణలు, ఈ యాప్ ద్వారా జరిగిన భారీ ఆర్థిక లావాదేవీలు, మనీలాండరింగ్ వ్యవహారాలపై ఈడీ ప్రధానంగా దృష్టి సారించింది. సురేష్ రైనా 1xBet అనే ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌తో కలిసి పనిచేశారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ యాప్ ద్వారా వేల కోట్ల రూపాయల అక్రమ లావాదేవీలు, మనీలాండరింగ్ జరిగినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఈ యాప్‌ను ప్రమోట్ చేయడంలో రైనా పాత్ర ఎంతవరకు ఉంది? దీనికోసం ఆయనకు ఎంత మొత్తం చెల్లించారు? ఒప్పందాలు ఎలా జరిగాయి? వంటి విషయాలను తెలుసుకునేందుకు ఈడీ రైనాను విచారణకు పిలిచింది. ఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయంలో ఈ విచారణ జరగనుంది. ఈ విచారణలో రైనా ఈ యాప్‌తో తనకున్న సంబంధాలపై వివరణ ఇవ్వాల్సి ఉంటుంది.

**ప్రముఖుల ప్రచారం, యువతపై ప్రభావం**

నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ప్రముఖుల ప్రచారం వల్ల అక్రమ బెట్టింగ్ యాప్‌లకు ఒక రకమైన విశ్వసనీయత లభిస్తుంది. సురేష్ రైనా వంటి క్రికెట్ దిగ్గజాలు, ఇతర సినీ ప్రముఖులు ఈ యాప్‌లను ప్రమోట్ చేయడం వల్ల యువత, అభిమానులు వాటిపై సులభంగా నమ్మకం పెట్టుకుంటారు. ఈ నమ్మకం చివరికి వారిని బెట్టింగ్ వైపు ఆకర్షిస్తుంది. ఇది కేవలం ఆర్థిక మోసాలకు మాత్రమే కాకుండా, అనేక మంది యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని ఈడీ ఇప్పటికే స్పష్టం చేసింది. బెట్టింగ్ యాప్‌ల ప్రచారం దేశవ్యాప్తంగా వేల కోట్ల రూపాయల మోసాలకు కారణమవుతోందని, ఈ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఈడీ వర్గాలు పేర్కొంటున్నాయి.

**ఇప్పటికే విచారణ ఎదుర్కొన్న ప్రముఖులు**

సురేష్ రైనాకు సమన్లు జారీ చేయడం ఈ కేసులో మొదటిసారి కాదు. ఇప్పటికే ఇదే కేసులో పలువురు సినీ ప్రముఖులను తెలంగాణ పోలీసులు, ఈడీ అధికారులు ప్రశ్నించారు. వీరిలో నటులు రానా దగ్గుబాటి, ప్రకాష్ రాజ్, మంచు లక్ష్మి వంటివారు ఉన్నారు. ఈ విచారణలో వారు బెట్టింగ్ యాప్‌లతో తమకు ఉన్న సంబంధాలపై సమాధానం ఇవ్వాల్సి వచ్చింది. ఇప్పుడు సురేష్ రైనా విచారణతో ఈ కేసులో మరిన్ని కొత్త విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

**భవిష్యత్తుపై అంచనాలు**

సురేష్ రైనా విచారణ తర్వాత, బెట్టింగ్ మాఫియాపై ఈడీ మరింత గట్టి చర్యలు తీసుకునే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఈ కేసులో వెలుగులోకి వచ్చే విషయాలను బట్టి, మరికొంతమంది ప్రముఖులపై కూడా దర్యాప్తు కొనసాగే అవకాశం ఉంది. ఈ పరిణామాలపై క్రికెట్ ప్రపంచం, రైనా అభిమానులు ఆందోళనగా ఎదురు చూస్తున్నారు. ఒకవైపు అభిమానుల ప్రేమను పొందిన రైనా, మరోవైపు ఇలాంటి అక్రమ వ్యవహారాల్లో ఇరుక్కోవడం వారిని తీవ్ర నిరాశకు గురిచేసింది. ఈ కేసు తుది తీర్పుతో బెట్టింగ్ యాప్‌ల ప్రచారంపై కఠిన చట్టాలు రూపొందించే అవకాశం కూడా లేకపోలేదు.

అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల కేసులో సురేష్ రైనాకు సమన్లు జారీ చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈడీ దర్యాప్తుతో ఈ మాఫియా కార్యకలాపాలు, ప్రముఖుల ప్రచారం వెనుక ఉన్న చీకటి కోణాలు బయటపడే అవకాశం ఉంది. ఈ కేసు తుది పరిణామాలు క్రికెట్, సినిమా పరిశ్రమలకు ఒక హెచ్చరికగా నిలుస్తాయి. ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తే, భవిష్యత్తులో ఇలాంటి అక్రమ యాప్‌ల ప్రచారానికి ప్రముఖులు దూరంగా ఉండవచ్చు. ఈడీ తన దర్యాప్తును ఎలా ముందుకు తీసుకువెళ్తుందో చూడాలి.

# బాబు గురించి జగన్ ఇలా పవన్ అలా !

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ ముఖ్యమంత్రిగా నాలుగవ సారి ప్రమాణం చేసిన చంద్రబాబుది సుదీర్ఘమైన రాజకీయ అనుభవం. మరో మూడేళ్ళలో ఆయన రాజకీయ జీవితం అర్ధశతాబ్దం దాటుతుంది. ఎర్లీ సెవెంటీస్ నుంచి విద్యార్థి రాజకీయాల ద్వారా ఎంట్రీ ఇచ్చిన బాబు ఎంతో మంది సీనియర్లతో కలసి పనిచేశారు. చెన్నారెడ్డి మెచ్చిన నేతగా ఉన్నారు. ఆ తరువాత అంజయ్య, భవనం వెంకటరామ్, కోట్ల విజయభాస్కరరెడ్డి మంత్రివర్గాలలో కాంగ్రెస్ మంత్రిగా పనిచేశారు. అలాగే తెలుగుదేశంలో చేరి ఎన్టీఆర్ మంత్రివర్గంలో రెవిన్యూ ఆర్థిక శాఖలు చేపట్టారు.



**చిన్న వయసులో పెద్ద పదవి :**

కేవలం నాలుగున్నర దశాబ్దాల వయసులోనే చంద్రబాబు దక్షిణాదిన అతి పెద్ద రాష్ట్రంగా ఉన్న ఉమ్మడి ఏపీకి సీఎం గా బాధ్యతలు 1995లో చేపట్టారు. అది లగాయితూ ఏకంగా తొమ్మిదిన్నరేళ్ళ పాటు ఆయన ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఇక విభజన ఏపీలో కూడా 2014 నుంచి 2019 దాకా ఒకసారి, 2024లో మరోసారి గెలిచి ప్రస్తుతం ఇంకోసారి సీఎం గా బాబు ఉన్నారు ఇక చూస్తే బాబు వయసు ఇపుడు ఏడున్నర పదులు నిండి 76వ పడిలో ఉన్నారు.

**ఆఖరు ఎన్నికలేనా :**

ఇక వచ్చేసారి ఎన్నికలు 2029లో జరుగుతాయి. ఆ ఎన్నికల నాటికి చంద్రబాబు వయసు దాదాపుగా 80 ఏళ్ళ వరకూ ఉంటుంది. మరి ఆ ఏజ్ లో ఆయన మరోసారి సీఎం అభ్యర్థిగా ఉంటారా ఉండరా అన్నది కూటమి పార్టీలు నిర్ణయించుకోవాల్సిన విషయం. అయితే వైసీపీ అధినేత మాజీ సీఎం జగన్ మాత్రం చంద్రబాబుకు 2024 ఎన్నికలే ఆఖరు ఎన్నికలు అని అంటున్నారు. చంద్రబాబుకు ఈసారి వచ్చిన అవకాశాన్ని మంచి కోసం ఉపయోగించాలని సూచిస్తున్నారు. మార్పు తెచ్చుకో బాబూ అని కూడా విసురులు విసురుతున్నారు.

**పవన్ మాటల్లో చూస్తే :**

అయితే జగన్ చంద్రబాబు ఏజ్ ని చూస్తూ ఆయన రాజకీయంగా ఇక ముందు రోజులలో పెద్దగా క్రియాశీలకంగా ఉండరని భావిస్తున్నారులా ఉంది. అయితే జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాత్రం చంద్రబాబులో వయసుని చూడడం లేదు, ఆయన సత్తాను చూస్తున్నారు అని అంటున్నారు. బాబు సమర్థుడు అయిన పరిపాలకుడని అందువల్ల ఆయన మరో పదిహేనేళ్ళ పాటు ఏపీలో కూటమి ప్రభుత్వానికి సారథ్యం వహించాలని పదే పదే అనేక బహిరంగ సభలలోనే పవన్ ఇప్పటికే చెప్పి ఉన్నారు. అంటే బాబుకి ఏజ్ అన్నది ఒక టెక్నికల్ ఇష్యూ మాత్రమే అన్నది పవన్ భావన అని అంటున్నారు.

**రియాలిటీ ఏంటి :**

అయితే బాబులో ఎంత స్టామినా ఉన్నా రాజకీయాలు అన్నవి నిత్యం ఒత్తిళ్ళతో కూడుకున్నవి ఇక బాబు చూడని ముఖ్యమంత్రి పదవి కాదు. ఆయన 2029లో కూటమి సారథ్యం వహించడం ఎటూ ఖాయం. అయితే ఆ తర్వాత తిరిగి కూటమి పవర్ లోకి వస్తే బాబు సీఎం గా ఉంటారా అన్నదే ఒక చర్చగా ఉంది. లోకేష్ బాబు వారసుడిగా ఇప్పటికే రెడీగా ఉన్నారు. ఆయనను సీఎం గా చేయాలని యువతరం పార్టీలో గట్టిగా కోరుతోంది. ప్రస్తుతం 42 ఏళ్ళ వయసు ఉన్న లోకేష్ మరో నాలుగేళ్ళకు 46 ఏళ్ళ వారు అవుతారు. సరిగ్గా ఆ వయసులోనే చంద్రబాబు కూడా సీఎం అయ్యారు. దాంతో లోకేష్ రూపంలో బాబుకు అయితే ఎంతో కొంత ఒత్తిడి ఉండొచ్చు అన్న ప్రచారం కూడా ఉంది.

**ఇంతకీ ఎవరిది కరెక్ట్ :**

ఏపీ ఫ్యూచర్ పాలిటిక్స్ ని సరిగ్గా అంచనా ఎవరు వేస్తున్నారు అన్న చర్చ అయితే ఉంది. జగన్ వరకూ తీసుకుంటే బాబు పొలిటికల్ ఇన్నింగ్స్ దాదాపుగా అయిపోయాయనే గట్టిగా నమ్ముతున్నారు. బాబు బలమైన ప్రత్యర్థి గా ఆయన బయటకు చెప్పకపోయినా లోలోపల అయినా అంగీకరిస్తారు అంటారు. బాబు కనుక తప్పుకుంటే ఏపీ రాజకీయాల్లో జగన్ కి తిరుగులేదని వైసీపీ వర్గాలు కూడా భావిస్తాయని చెబుతారు. ఇక లోకేష్ పవన్ ఈ ఇద్దరూ కూటమిలో కాబోయే సీఎంలుగా ప్రచారంలో ఉన్న వారు.

అయితే లోకేష్ కే ఎక్కువ చాన్స్ వచ్చే ఎన్నికల్లో కూటమి గెలిస్తే ఉంటుంది అని అంటున్నారు. అదే జరిగితే అపుడు జనసేన పవన్ పాలిటిక్స్ ఎలా ఉంటుందో తెలియదు. ఇక వైసీపీకి ఒక అడ్వాంటేజ్ ఏంటి అంటే 2029లో ఆరు నూరు అయినా గెలుస్తామని నమ్మకం ఉంది. కూటమిలో లుకలుకలే తమకు శ్రీరామ రక్ష అన్న ఆలోచన కూడా ఉంది అంటారు. అందుకే బాబు మీదనే గురి పెట్టి మరీ విమర్శలు సంధిస్తున్నారు అని అంటారు. చూడాలి మరి ఈ అంచనాలు ప్రచారాలు ఏ మేరకు నిజం అవుతాయో.

# అమితాబ్ షోలో 'ఆపరేషన్ సింధూర్' నాయికలు.. స్ట్రీమింగ్ అప్పుడే?



**హైదరాబాద్ పెన్ పవర్:** బాలీవుడ్ ఇండస్ట్రీలో అమితాబ్ బచ్చన్ అంటే ఎంత క్రేజ్ ఉంటుందో మనందరికీ తెలుసు. ఆ క్రేజ్ కు తగ్గట్టే ఆయన చేసే షో 'కౌన్ బనేగా కరోడ్ పతి'. అయితే ఈ షో 17వ సీజన్ కోసం చాలామంది స్పెషల్ గెస్ట్‌లను పిలిచారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ ఎపిసోడ్ టెలికాస్ట్ అవ్వనుంది. అయితే ఈ సందర్భంగా దేశం కోసం పోరాడి, గెలిచిన నిజమైన హీరోలను మనకు చూపించబోతున్నారు. ఇంతకీ వారు ఎవరయ్యా అంటే..ఆడ పులులు.. "ఆపరేషన్ సింధూర్" తో అద్భుతాలు సృష్టించిన ముగ్గురు మహిళ అధికారులు.. వీరిలో వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, కల్నల్ సోఫియా ఖురేషి, కమాండర్ ప్రేరణ డియోస్తలి రాబోతున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ షోలో వారు పాల్గొంటారని తెలుస్తోంది. దీనికి సంబంధించిన ఎపిసోడ్ ప్రోమో తాజాగా రిలీజ్ అయింది. ఈ ప్రోమోలో ఈ ముగ్గురు అధికారులు ఆపరేషన్ సింధూర్ లో ఎదుర్కొన్న ఆసక్తికర విషయాల గురించి తెలియజేశారు. అయితే ఆపరేషన్ సింధూర్ గురించి కల్నల్ ఖురేషి మాట్లాడుతూ.. "ఆపరేషన్ సింధూర్ అనేది తప్పనిసరి చర్య అన్నారు". ఆ సమయంలో అది ఎందుకు అవసరమో కూడా తెలియజేశారు. వ్యోమికా సింగ్ , ప్రేరణ కూడా ఇదే విషయాన్ని బయట పెట్టారు. పాకిస్తాన్ ఈ విధంగా పదే పదే భారతదేశాన్ని ఇబ్బంది పెడుతోంది. కాబట్టి ఆపరేషన్ సింధూర్ వంటి యుద్ధం తప్పనిసరి అయిందని అన్నారు. ఆపరేషన్ సింధూర్ ప్రోగ్రామ్ అనేది కేవలం 25 నిమిషాల్లో పూర్తయిందని వ్యోమికా సింగ్ తెలియజేశారు. ఈ టైంలోనే అనుకున్న లక్ష్యాలను ఛేదించామని కమాండర్ ప్రేరణ డియోస్తలి అన్నారు. ఈ విధంగా ఈ ముగ్గురు రియల్ రాణి రుద్రమదేవిలు ఆపరేషన్ సింధూర్ గురించి అద్భుతంగా వర్ణించినట్టు ఈ ప్రోమోలో చూపించారు. అయితే ఈ ప్రోమో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవ్వడంతో పూర్తి షో కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నామని ప్రోమో చూసిన నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ ఫుల్ ఎపిసోడ్ వస్తోంది. అయితే విడుదలైన ప్రోమో పై కొన్ని విమర్శలు కూడా వస్తున్నాయి.

ఎందుకంటే ప్రోటోకాల్ ని ఈ ముగ్గురు అధికారులు ఉల్లంఘించారని అంటున్నారు. అంతేకాదు ఇప్పటివరకు చాలా దేశాల్లో చాలా యుద్ధాలు జరిగాయి. కానీ ఇలా ఏ సైనిక అధికారి కూడా యూనిఫాం ధరించి ఎంటర్టైన్మెంట్ షోలకు వెళ్లలేదు. మొదటిసారి వీళ్లు ఈ దేశంలో షో కి యూనిఫాం వేసుకొని వచ్చారు.. భారతదేశ సాయుధ దళాలకు ఎంతో గౌరవం ఉంది. అలాంటి గౌరవ మర్యాదల్ని కొన్ని రాజకీయ పార్టీలు తమ స్వార్థ రాజకీయాల కోసం వాడుకుంటున్నాయి అంటూ ఈ అధికారులు చేసిన పనిపై మండి పడుతున్నారు. యూనిఫామ్ వేసుకుని ఎంటర్టైన్మెంట్ షోకి ఎలా వస్తారంటూ సోషల్ మీడియా వేదికగా కొంతమంది ప్రశ్నిస్తున్నారు.

# పార్లమెంట్ సెషన్ : వాయిదాలు తప్ప చర్చలేవీ ?

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో అత్యున్నత చట్ట సభలుగా లోక్ సభ రాజ్యసభ ఉన్నాయి. ఇక వర్షాకాల సమావేశాలు జూలై 21 నుంచి ప్రారంభం అయ్యాయి. ఆగస్టు 21 వరకూ ఈ సమావేశాలు జరుగుతాయని షెడ్యూల్ ఖరారు చేశారు. అయితే ఈసారి చూస్తే కనుక అత్యధిక పని దినాలలో వాయిదాల పర్వమే సాగుతూ వస్తోంది. ఆపరేషన్ సింధూర్ మీద మాత్రమే చర్చ వాడిగా వేడిగా సాగింది.



**ప్రతీ రోజూ అంతేనా :**

ఇక దాదాపుగా చూస్తే ప్రతీ రోజూ పార్లమెంట్ సమావేశం అవుతూనే విపక్షాలు నిరసనల మధ్య ప్రభుత్వం కొన్ని బిల్లులను ప్రతిపాదించడం ఆ తరువాత సభ వాయిదా పడుతున్న దశలో పెద్దగా చర్చ లేకుండా వాటిని ఆమోదించడం జరుగుతోంది. పార్లమెంట్ సమావేశాలు ఈ విధంగా వర్షార్పణం అయ్యాయని అంటున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ కానీ విపక్ష నేత రాహుల్ గాంధీ కానీ సభలో ఎక్కువగా కనిపించడం లేదు. అలాగే ఇతర సభ్యులకు కూడా ఆసక్తి తగ్గిపోతోంది అని అంటున్నారు.

**ఒకే ఒక ఇష్యూతో :**

విపక్షాలు అన్నీ ఒకే ఒక అంశం మీదనే ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో పట్టుబడుతున్నాయి. బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్ అంశంపైనే లోక్‌సభ రాజ్యసభ చర్చ జరగాలని డిమాండ్ చేస్తున్నాయి. అయితే దానికి ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో ప్రతీ రోజూ దాదాపుగా సభ అనేకసార్లు వాయిదా పడుతూ చివరికి మరుసటి రోజుకు వాయిదాగా సాగుతోంది. ఇక మంగళవారం లోక్‌సభ మూడుసార్లు వాయిదా పడగా, రాజ్యసభ రెండుసార్లు వాయిదా పడింది, చివరికి ఈ నెల 18వ తేదీకి ఉభయ సభలు వాయిదా పడడం విశేషం.

**చర్చలో పాల్గొనాలంటూ :**

ఇదిలా ఉంటే పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ప్రతిపక్ష ఎంపీలు స్పీకర్ కుర్చీ వైపు కాగితం విసిరినందుకు వారి ప్రవర్తనను ఖండించారు. ఇది సభా మర్యాదకు విరుద్ధమని ఆయన అన్నారు. దేశ ప్రజలు చర్చలో పాల్గొనడానికి ప్రతిపక్ష ఎంపీలను పంపినందున వారు చర్చలో పాల్గొనాలని ఆయన అన్నారు. నిరసన తెలుపుతున్న ఎంపీల ప్రవర్తనపై స్పీకర్ సైతం అసంతృప్తి వ్యక్తం చేశారు, వారు సభా మర్యాదను దెబ్బతీస్తున్నారని అన్నారు.

**కీలక బిల్లులు ఆమోదం :**

ప్రభుత్వం పార్లమెంట్ ని సమావేశపరచేది బిల్లులను ఆమోదించుకోవడానికి. అయితే విపక్షం ఆ బిల్లులల్లో లోటు పాట్లను చర్చించి సరైన సూచనలు చేసి బిల్లులు జనాలకు పూర్తిగా ఉపయోగపడేలా చూడాల్సి ఉంది. కానీ విపక్ష సభ్యులు వాకౌట్ చేస్తున్నారు. దాంతో ఏ చర్చ లేకుండానే బిల్లులు ఆమోదం పొందుతున్నాయి. అలా మంగళవారం లోక్‌సభ జాతీయ క్రీడా పాలన బిల్లు, 2025, జాతీయ డోపింగ్ నిరోధక సవరణ బిల్లు, 2025లను ఆమోదించింది. ఆదాయపు పన్ను బిల్లు, 2025 పన్ను చట్టాలు సవరణ బిల్లు, 2025లను కూడా సభ ఆమోదించింది.

**గతంలో సాగు చట్టాలతో :**

ఇక వెనక్కి వెళ్తే సాగు చట్టాలను రద్దు చేయాలని కోరుతూ విపక్షాలు డిమాండ్ చేస్తూ వచ్చాయి. వరసగా మూడు సెషన్ల సభా కాలాన్ని చర్చలు లేకుండానే ముగించేశారు. ఇలా పార్లమెంట్ సెషన్ కి ముందు జాతీయ అంశాలు అనేకం ఉన్నా కొన్ని మాత్రమే విపక్షాలు తీసుకుంటున్నాయన్న విమర్శలు ఉన్నాయి. దాంతో మిగిలినవి మరుగున పడిపోతున్నాయి అంటున్నారు.

**సజావుగా జరుగుతున్నాయా :**

మోడీ ప్రధాని అయ్యాక 2014 నుంచి 2019 మధ్యలో కొంత సజావుగా పార్లమెంట్ సమావేశాలు జరిగాయని అంటున్నారు. ఆ తరువాత రెండోసారి మోడీ అధికారం చేపట్టినప్పటి నుంచి పార్లమెంట్ సెషన్లలో అధికార పక్షం వర్సెస్ విపక్షంగా మారిపోతూ సభా కాలాన్ని హరించేస్తున్నాయని అంటున్నారు. ఇక్కడ విపక్షం లేవనెత్తే అంశాలలో సహేతుకత ఉంటే వాటిని అధికార పక్షం స్వీకరించి చర్చకు రావాలి. అలాగే విపక్షం సైతం ఒకే ఇష్యూకే కట్టుబడిపోకుండా విశాలమైన దేశ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని కీలక బిల్లుల మీద చర్చ జరపాలని ప్రజాస్వామ్య ప్రియులు కోరుతున్నారు. శీతాకాల సమావేశాలలో అయినా ఆ వైఖరి కనబడాలని అంతా ఆశిస్తున్నారు.

## 5 బంతుల్లో 26 పరుగులు.. హండ్రెడ్ లీగ్‌లో రషీద్ ఖాన్ అత్యంత చెత్త బౌలింగ్




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 క్రికెట్ లో ఆఫ్ఘనిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ వన్ ఆఫ్ ది టాప్ బౌలర్లలో ఒకడు. ఏళ్ళు గడుస్తున్నా ఈ మిస్టరీ స్పిన్నర్ ను డీకోడ్ చేయడం బ్యాటర్లకు పెద్ద సమస్యగా మారింది. అందుకే ప్రపంచంలో ఎక్కడ క్రికెట్ లీగ్ జరిగినా ఈ ఆఫ్ఘన్ స్పిన్నర్ ను పోటీ పడి మరీ తీసుకుంటారు. దశాబ్ద కాలానికి పైగా టీ20 క్రికెట్ లో తనదైన మార్క్ చూపిస్తు వస్తున్నాడు. ఇప్పటికీ రషీద్ ఖాన్ స్పిన బ్యాటర్లకు ఒక సవాలే. తన స్పిన్ మాయాజాలంతో టీ20 క్రికెట్ లో ఎన్నో రికార్డులు తన పేరిట లిఖించుకున్న రషీద్ ఖాన్ కు ఈ ఏడాది (2025) కష్టకాలం కొనసాగుతోంది. లీగ్ ఏదైనా రషీద్ ను అలవోకగా ఆడేస్తున్నారు. ప్రస్తుతం ఇంగ్లాండ్ లో జరుగుతున్న హండ్రెడ్ లీగ్ లో రషీద్ తన పేలవ ఫామ్ కొనసాగిస్తున్నాడు. మంగళవారం (ఆగస్టు 12) బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన హండ్రెడ్ లీగ్ మ్యాచ్ లో రషీద్ ఖాన్ ఘోరంగా విఫలమయ్యాడు. ఓవల్ ఇన్విన్సిబుల్స్ తరపున ఆడుతున్న రషీద్ ఖాన్ తన 20 బంతుల్లో ఏకంగా 59 పరుగులు సమర్పించుకున్నాడు. బర్మింగ్ హెూామ్ హామ్ ఫీనిక్స్ లియామ్ లివింగ్‌స్టోన్ రషీద్ వేసిన ఓవర్లో 5 బంతుల్లోనే మూడు సిక్సర్లు, రెండు ఫోర్లతో 26 పరుగులు రాబట్టాడు. రషీద్ తన మొదటి ఐదు బంతుల్లో 8 పరుగులు ఇచ్చాడు. ఆ తర్వాత 15 బంతుల్లో 51 పరుగులు బాదారు.

రషీద్ ఖాన్ టీ20 చరిత్రలో ఇవే అత్యంత చెత్త గణాంకాలు. ఐపీఎల్ 2018లో పంజాబ్ కింగ్స్ పై సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడిన ఈ ఆఫ్ఘన్ స్పిన్నర్ 55 పరుగుల తన చెత్త రికార్డును బ్రేక్ చేసుకున్నాడు. హండ్రెడ్ లీగ్ లో కూడా అత్యధిక పరుగులు ఇచ్చిన ఆటగాడిగా నిలిచాడు. 26 ఏళ్ల రషీద్ ఖాన్ ఇటీవలే జరిగిన ఐపీఎల్ సీజన్ 2025లో పెద్దగా రాణించలేదు. 15 మ్యాచ్‌లలో 57.11 సగటుతో 9 వికెట్లు మాత్రమే పడగొట్టగలిగాడు. ఐపీఎల్ లో విఫలమైనా హండ్రెడ్ లీగ్ లో అదే పేలవ ఆట తీరును కొనసాగిస్తున్నాడు. ఇదే టోర్నీలో టీ20 ఫార్మాట్ లో 650 వికెట్లు తీసిన తొలి ఆటగాడిగా రషీద్ ఖాన్ చరిత్ర పుటల్లో తన పేరును లిఖించుకున్నాడు.

ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేసిన ఓవల్ ఇన్విన్సిబుల్స్ 100 బంతుల్లో 180 పరుగుల

భారీ స్కోరును నమోదు చేసింది. డోనోవన్ ఫెర్రీరా (29 బంతుల్లో 63), జోర్డాన్ కాక్స్ (30 బంతుల్లో 44) మెరుపులు మెరిపించి జట్టుకు భారీ స్కోర్ అందించారు. ట్రెంట్ బౌల్ట్ (2/20), ఆడమ్ మిల్నే (2/28) చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఆ తర్వాత బర్మింగ్‌హామ్ ఫీనిక్స్ 98 బంతుల్లో 181 పరుగుల లక్ష్యాన్ని ఛేజ్ చేసి గెలిచింది. లివింగ్‌స్టోన్ 69లి (27) మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడి జట్టుకు విజయాన్ని అందించాడు.

## దేశ సైనికుల త్యాగాలు ఏ క్రికెట్ కంటే ఎక్కువ కాదు.. బీసీసీపై మాజీ స్పిన్నర్ ఫైర్




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ లీగ్ లో భాగంగా పాకిస్తాన్ తో జరగాల్సిన సెమీ ఫైనల్ మ్యాచ్ ను ఇండియా ఛాంపియన్స్ రద్దు చేసుకున్న సంగతి తెలిసిందే. రెండు దేశాల మధ్య కొనసాగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా చాలామంది భారత ఆటగాళ్లు పాకిస్థాన్ తో మ్యాచ్ బహిష్కరించాలని కోరడంతో మ్యాచ్ రద్దయింది. అంతకముందు పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా శిఖర్ ధవన్ సహా పలువురు ఇండియా వెటరన్ ప్లేయర్లు పాకిస్థాన్ తో లీగ్ మ్యాచ్ ఆడేందుకు నిరాకరించగా.. సెమీ ఫైనల్ కూడా ఆడకుండా టోర్నీ నుంచి నిష్క్రమించింది. దీంతో పాక్ సెమీస్ కు వెళ్లగా టీమిండియా మ్యాచ్ ఆడకుండానే ఇంటిదారి పట్టింది. ఇండియా ఛాంపియన్స్ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల దేశామంతా వీరిని గౌరవించింది. ఆట కంటే దేశమే ముఖ్యమనే వీరి నిర్ణయంపై ప్రశంసలు కురిపించారు. అయితే లెజెండ్స్ లీగ్ రద్దు చేసుకున్నా.. అంతర్జాతీయ క్రికెట్ లో పాకిస్థాన్ తో తలపడేందుకు టీమిండియా బీసీసీఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దుబాయ్ వేదికగా పాకిస్తా, ఇండియా ఆసియా కప్ లో ఆడబోతున్నారు. బీసీసీఐ తీసుకున్న ఈ నిర్ణయాన్ని భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ తప్పుబట్టారు. బీసీసీఐ వైఖరిని తప్పుపడుతూ మ్యాచ్ నిర్వహించకుండా ఉండాల్సిందని చెప్పుకొచ్చాడు. ఆసియా కప్ 2025 లో పాకిస్తాన్‌తో క్రికెట్ మ్యాచ్ నిర్వహించాలనే బీసీసీఐ నిర్ణయాన్ని హర్భజన్ సింగ్ తీవ్రంగా విమర్శించాడు. జాతీయ ఉద్రిక్తతల మధ్య భారత సైనికులు చేసిన అపారమైన త్యాగాలతో పోలిస్తే క్రికెట్ పోటీ చాలా తక్కువ అని బీసీసీపై ఫైరయ్యాడు. ఏ వ్యక్తి దేశం కంటే పెద్దవాడు కాదని.. పాకిస్థాన్ మ్యాచ్ లు పూర్తిగా బహిష్కరించాలని ఈ వెటరన్ క్రికెటర్ చెప్పుకొచ్చాడు. ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (%ఔజూ%) లీగ్ లో 2025 లో పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌ను భారత ఆటగాళ్ళు బహిష్కరించిన కొన్ని వారాల తర్వాత హర్భజన్ చేసిన ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశమవుతున్నాయి.ఆసియా కప్ 2025 సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు జరగనుంది. ఈ టోర్నీ అన్ని మ్యాచ్ లు దుబాయ్, అబుదాబిలో జరగనున్నాయి. టీ20 ఫార్మాట్ లో జరగనున్న ఈ టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్ ఆఫ్ఘనిస్తాన్, హాంకాంగ్

మధ్య అబుదాబిలో జరుగుతుంది. చిరకాల ప్రత్యర్థులు ఇండియా, పాకిస్థాన్ మ్యాచ్ సెప్టెంబర్ 14న దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరుగుతుంది. ఇటీవలే జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో కూడా దాయాధి జట్లు దుబాయ్ వేదికగానే లీగ్ మ్యాచ్ ఆడడం విశేషం. ఫైనల్ సెప్టెంబర్ 28న దుబాయ్‌లో జరుగుతుంది.

## వన్డే ర్యాంకింగ్స్‌లో దుమ్ములేపారుగా: టాప్-4లో రోహిత్, కోహ్లీ.. అగ్రస్థానంలోనే గిల్





**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలపై గత కొంతకాలంగా వన్డే రిటైర్మెంట్ ప్రచారం జరుగుతోంది. వీరిద్దరి వన్డే కెరీర్ ఇక ముగిసిందని.. జట్టుకు వీరి అవసరం ఇక లేదని.. బీసీసీఐ యంగ్ ఇండియా వైపు అడుగులు వేస్తోందని వార్తలు వచ్చాయి. అయితే తాజాగా రోకో జోడీ వన్డే ర్యాంకింగ్స్ లో చాటారు. ఐసీసీ బుధవారం (ఆగస్టు 13) రిలీజ్ చేసిన ర్యాంకింగ్స్ లో రోహిత్ రెండో స్థానానికి చేరుకున్నాడు. మరోవైపు విరాట్ కోహ్లీ (736) నాలుగో స్థానంలో నిలిచాడు. ఇటీవలే వెస్టిండీస్ తో జరిగిన వన్డే సిరీస్ లో పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ అజామ్ ఘోరంగా విఫలం కావడంతో మూడో స్థానికి పడిపోయాడు. బాబర్ (751) విఫలం కావడంతో రోహిత్ (756) రెండో ర్యాంక్ కు చేరుకున్నాడు. తొలి స్థానంలో టీమిండియా ఓపెనర్ శుభమాన్ గిల్ (784) కొనసాగుతున్నాడు.

టాప్ -4 ఏకంగా ముగ్గురు టీమిండియా క్రికెటర్లు ఉండడం విశేషం. డారిల్ మిచెల్ టాప్-5 బ్యాటర్ల జాబితాలో చోటు సంపాదించాడు. ఫిబ్రవరిలో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో కోహ్లీ, రోహిత్, గిల్ అద్భుతంగా రాణించారు. ఇతర భారత క్రికెటర్లలో శ్రేయాస్ అయ్యర్ 8 వ ర్యాంక్ లో నిలిచాడు. వికెట్ కీపర్ బ్యాటర్ రాహుల్ 15 ర్యాంక్ లో కొనసాగుతున్నాడు. టీ20 ర్యాంకింగ్స్ లో కూడా టాప్-2 లో టీమిండియా ప్లేయర్స్ కావడం విశేషం. తొలి స్థానంలో అభిషేక్ శర్మ, రెండో స్థానంలో తిలక్ వర్మ నిలిచారు.బౌలింగ్ విషయానికి వస్తే శ్రీలంక స్పిన్నర్ మహీష్ తీక్షణ 671 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. టీమిండియా బౌలర్లలో కుల్దీప్ యాదవ్ రెండో స్థానంలో ఉండగా.. జడేజా 9 ర్యాంక్ లో నిలిచాడు. ఫాస్ట్ బౌలర్లు మహమ్మద్ షమీ 14 వ స్థానంలో.. సిరాజ్ 15 వ స్థానంలో కొనసాగుతున్నారు. ఇటీవలే పాకిస్తాన్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల్లో నాలుగు వికెట్లు తీసిన వెస్టిండీస్ స్పిన్నర్ గుడాకేష్ మోతీ ఐదు స్థానాలు ఎగబాకి 12వ స్థానానికి చేరుకోవడం హైలెట్ గా నిలిచింది. ఆల్ రౌండర్ విభాగానికి వస్తే జడేజా ఒక్కడే టీమిండియా నుంచి 10 స్థానంలో ఉన్నాడు. ఆఫ్ఘనిస్తాన్ ఆల్ రౌండర్ ఒమర్జాయ్ అగ్ర స్థానంలో ఉన్నాడు.



సాంచి రాయ్ తన లేటెస్ట్ లుక్‌లో గ్రేస్‌తో మెరుస్తోంది

## ఆ ముగ్గురు పాలిట మెగాస్టార్ ఆపద్బాంధవుడు!

సీనియర్ బ్యూటీలు త్రిష, నయనతార కెరీర్ ఇప్పుడంత స్పీడ్ గా లేదు. సెలక్టివ్ గా సినిమాలు చేస్తు న్నారు. హీరోల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. హీరోతో పాటు కథ కూడా పక్కాగా ఉంటేనే కమిట్ అవుతున్నారు. లేదంటే వచ్చిన అవకాశాలే వదులుకుంటున్నారు. ఈ క్రమంలో రిలీజ్ లకు గ్యాప్ ఏర్పడుతుంది. త్రిష గత చిత్రం - థగ్ లైఫ్ - బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్గా నమోదైంది. దానికంటే ముందు రిలీజ్ అయిన - గుడ్ బ్యాడ్ అగ్లీ - పర్వాలేదనిపించినా ఆ సక్సెస్ ని - థగ్ లైఫ్ - తో కొనసాగించ లేకపోయింది.

**వరుస వైఫల్యాలు:**



దీంతో చేతిలో ఉన్న -విశ్వంభర - చిత్రం కీలకంగా మారింది. ఇందులో మెగాస్టార్ చిరంజీవికి జోడీగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. మరో సినిమా -కురుప్పు- కూడా చేస్తోంది. కానీ భారీ అంచనాలు మాత్రం చిరంజీవి చిత్రంపైనే పెట్టుకుంది. -విశ్వంభర- సక్సెస్ తో తెలుగులో బిజీ అవ్వాలని ఆశపడుతోంది. మరోవైపు లేడీ సూపర్ స్టార్ గా నీరాజనాలు అందుకుంటోన్న నయనతార కూడా వరుస పెయిల్యూర్స్ లో ఉంది. -జవాన్- తర్వాత చేసిన ప్రయత్నాలేవి ఫలించలేదు. సమ్మర్ లో రిలీజ్ అయిన-టెస్ట్- కూడా ఫెయిలైంది.

**157పైనే ఆశలన్నీ:**

దీంతో ఈ ఏడాది మరో రిలీజ్ కూడా చేతిలో లేదు. కొత్త సినిమాలు చాలా చేస్తోంది. కానీ అవన్నీ రిలీజ్ అయ్యేది వచ్చే ఏడాదే. అందులో చిరంజీవి 157వ చిత్రం కీలకంగా మారింది. ఇందులో చిరుకు జోడీగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. 2026 రిలీజ్ లు అన్నింకంటే ఎక్కువగా నయన్ పోకస్ చేసిన చిత్రం కూడా ఇదే. అందుకే సినిమా కోసం తన ప్రమోషన్ నిబంధనలు సైతం పక్కన బెట్టి ప్రచార బరిలో నిలిచింది.

**చిరంజీవి సక్సెస్ కీలకం:**

మరోవైపు బాలీవుడ్ నటి మౌనీ రాయ్ కూడా చిరంజీవి సినిమాపైనే ఆశలు పెట్టుకుంది. విశ్వంభర-లో అమ్మడు ఐటం పాటలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఎంతో మంది భామల్ని పరిశీలించి చివరిగా మౌనీ రాయ్ ని తీసుకున్నారు. ఆమెకు కూడా సరైన అవకాశాలు లేని సమయంలో వచ్చిన గొప్ప ఛాన్స్ ఇది. ఈ పాటతో సక్సెస్ అందుకుని నటిగా, నర్తకిగా బిజీ అవ్వాలనే ప్లాన్ లో ఉంది. మరి ఈ ముగ్గురికి మెగాస్టార్ ఎలాంటి సక్సెస్ ఇస్తారో చూడాలి.



రెయిన్‌బో హార్ట్ మరియు సాల్ట్ హెయిర్‌తో కృతి సనన్ వైబ్రెంట్ వెకేషన్ వైబ్స్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com